# 108 శక్తి పీఠాల యాత్రా దర్శిని





భాగవతుల సుబ్రహ్మణ్యం

# 108 శక్తిపీఠాల యాత్రాదర్శిని

సేకరణ

**భాగవతుల సుబ్రహ్మణ్యం**



**108 SAKTHIPITALA YATRA DARSHINI**

Bhagavatula Subrahmanyam

First Edition : August, 2002
Cover Design : N.V. Ramana
Printed at : Swamy Offset Printers, VJA
DTP . Monarch Graphics, VJA

Publishers
**RUSHI PRACHURANALU**
Main Road, Hanumanpet,
Vijayawada 520 003
Ph : 91 - 866 579190

Price · 25-00

# విషయసూచిక



# ఈ మహత్తర కృషి వెనుక....

అష్టోత్తర (108) శక్తిపీఠాలు సందర్శించగోరే భక్త మహాశయుల ఆశయ సిద్ధిలో, నా పై బృహత్తర బాధ్యత నుంచి, ఈ పుస్తకం సంకలనం చేయడానికి నాకు అవకాశం ఇచ్చి, నన్ను మీకు సన్నిహితుల్ని చేసిన ఋషి పబ్లికేషన్స్ వారికి ఓం ప్రథమంగా నా కృతజ్ఞతాభివందనాలు.

వాస్తవానికి ఈ మహత్తర కృషి వెనుక - నన్ను నడిపించిన శక్తి ఆ అంబికదే! ఆ ఆది పరాశక్తిదే! నేను నిమిత్త మాత్రుడిని! ఇందులో నాదని చెప్పదగినది ఏదీ లేదు. ఎందుకంటే... "ఈ ప్రపంచంలోకి మనం ఏమీ తీసుకురాలేదు. మన మందరం ఇక్కడ ఉన్నదాన్నే ఒకరికొకరం ఆ జగదంబ దయవల్ల పరస్పరం ఇచ్చుకుంటున్నాం!" అని మా గురుదేవులు బోధించిన దానిలో నాకు సూచ్యార్థం వాచ్యార్థం రెండూ నా జీవితంలోనే చాలా అన్వయ పూర్వకంగా నాకు బోధపడ్డాయి. అదీ ఎలా? అంటే - ఈ శక్తిపీఠాలకు సంబంధించి తెలుసుకోగోరే వారికి కావలసిన సమాచారం నాకు మిత్రులు, హితైషులు, ఆస్తిక శిఖామణులు, ఇంతకు ముందు తీర్థయాత్రలు చేసి వచ్చినవారు నాకు అందజేశారు.

ఆవిధంగా వారు అందించిన సమాచారం, నాకు తోచిన క్రమంలో మీకు అందచేస్తున్నాను.



# మా మనవి

108 సంఖ్య గలిగిన శక్తిపీఠ క్షేత్రాలపై ఒక యాత్రాదర్శినిని, సందర్శకుల సౌకర్యార్థం అందజేయాలనే ఊహ, మా ఈ ప్రయత్నానికి ప్రేరణ.

దక్షుని కూతురైన సతీదేవి, తండ్రి చేస్తున్న యాగానికి 'పిలవని పేరంటం'లా వెళ్లగా, అక్కడ నిరాదరణకు గురై యోగాగ్నిలో తనువు చాలిందన్న వార్తకు చలించి దక్షయజ్ఞ విధ్వంసానికి శివుడాన తీయడం గాధ మనకు తెలిసినదే!

అనంతరం సతి దేహాన్ని భుజాన వేసుకుని భ్రాంతుడై యావద్భారత దేశం తిరగసాగిన శివుని రౌద్రానికి దేవతలు భీతిచెంది విష్ణువుతో మొర పెట్టుకోగా, ఆయన మహేశ్వరుని వెనుకగా అనుసరిస్తూ - సతీ దేహాన్ని తన సుదర్శన చక్రంతో ఛేదిస్తూ రాగా ఆమె శరీర భాగాలు; ఆభరణాలు పడిన చోట్ల ఈ శక్తిపీఠాలు వెలిశాయని పురాణగాథ!

ప్రాచీన అఖండ భారతంలోని కొన్ని ప్రాంతాలు నేడు నేపాల్, శ్రీలంక తదితర ప్రదేశాల్లో చేరగా, వాటిని కూడా సమీకరించి ఈ పుస్తకం ద్వారా అందజేశాం!

\- ప్రకాశకులు

ఇక్కడ సందర్శకులు ఓ విషయం గమనించాల్సి ఉంది.

ఎక్కువ భాగం యాత్రలు చేసి వచ్చినవారి నుంచి సేకరించిన సమాచారం దీనిలో పొందుపరచడం వల్ల - నాకు ఈ పుస్తక రచనలో ఎన్నో సందేహాలకు ఆస్కారం ఏర్పడింది. వాటిని నా స్వయం నిర్ణాయక శక్తిమేరకు, గ్రంథాలు (పురాణాలు, ఉపనిషత్‌లు మొదలుకొని మామూలుగా వచ్చే దినపత్రికల వరకు) శోధించి పరిష్కరించుకుని - ఈ సమాచారం మీకు అందించాను.

శక్తిపీఠాలకు సంబంధించి ఆసక్తికరమైన చర్చలు సాగించినపుడు, బాగా తలపండిన వయోవృద్ధులు సైతం తడుముకొనే పరిస్థితి మొట్టమొదట శక్తిపీఠాల సంఖ్య విషయంలోనే ఎదురైంది.

108 సంఖ్యలోనే మూడు విధాల శక్తిపీఠాలున్నాయనీ; మహా శక్తిపీఠాలు 18 (శ్లోకంలో చెప్పినవి), శక్తిపీఠాలు 54; ఉపశక్తి పీఠాలు 46 అనీ ఎక్కువమంది తేల్చిన సారాంశం.

నిర్ధారణకు రాని మరో పరిస్థితి... అమ్మవారి శరీర భాగాలు ఏవేవి ఎక్కడెక్కడ పడ్డాయి? అనే అంశంలోనూ ఎదురైంది. ఎవరికి తోచిన రీతిలో వారు చెప్తున్నారు. కొన్ని క్షేత్రాలు పీఠాలు మళ్లీ మళ్లీ శ్లోకంలోనే 'రిపీట్' అయ్యాయి. గమనించగలరు.

- సంకలన కర్త





# అష్టోత్తర పీఠాలలో ఆదిశక్తి

**శక్తిపీఠ సంఖ్య**

అష్టాదశ (18) శక్తిపీఠ స్తుతి ప్రకారం మనకు 18 శక్తిపీఠాలు శ్లోక ప్రామాణిక రూపంలో లభ్యమైనాయి. ఆ శ్లోకం ఇది :

లంకాయాం శాంకరీదేవి   కామాక్షీ కాంచికాపురే
ప్రద్యుమ్నే శృంఖలాదేవీ - చాముండీ క్రౌంచపట్టణే ।
అలంపురీ జోగులాంబా - శ్రీశైలే భ్రమరాంబికా
కొల్హాపురే మహాలక్ష్మీ - మాహుర్యే ఏకవీరికా ॥
ఉజ్జయిన్యాం మహాకాళీ   పీఠికాయాం పురుహూతికా
ఓఢ్యాయాం గిరిజాదేవీ , మాణిక్యాదక్ష వాటికే ।
హరిక్షేత్ర కామరూపా   ప్రయాగే మాధవేశ్వరీ
జ్వాలాయాం వైష్ణవీదేవీ - గయా మాంగల్యగౌరికా ॥
వారణస్యాం విశాలాక్షీ - కాశ్మీరేతు సరస్వతీ...
ఇదీ మనకు అందిన 18 సంఖ్య

అయితే - మిగిలిన 90 ఏమిటి? ఎలా వచ్చాయి?... ఈ ప్రశ్నకు సమాధానమే 'శక్తి పీఠాలు' అని మనం సాధారణంగా చెప్పకొనే వాటిలోనే మూడు తరగతులున్నాయని విజ్ఞులు సెలవిచ్చారు. వీనిలో మహా శక్తిపీఠాలు, సాధారణ శక్తిపీఠాలు, ఉపశక్తి పీఠాలు ఉంటాయని సూత్రీకరించారు. మహాశక్తి పీఠాలు ఏమిటో పైన శ్లోకంలోనే వున్నాయి. మిగిలినవి ఆరా తీయగా.... వివిధ సందర్భాలలో ఆదిపరాశక్తి దానవ సంహారం చేసినపుడు అవతారాలు ఎత్తిన

వైనాలతో సహా లింగ పురాణ దేవీ భాగవత తదితర గ్రంధాల్లో ప్రామాణిక శ్లోకాలు దర్శనమిచ్చాయి

'ఉప' - 'సాధారణ' శక్తిపీఠ వర్గీకరణ సామాన్యులకు సాధ్యమయ్యేది కాదని, పండితులే తేల్చి చెప్పారు. అంధువల్ల ఈ పుస్తకంలో మొత్తం 108 శక్తిపీఠాలను వర్గీకరించకుండానే ఇవ్వడం జరిగింది! అవును! 'శక్తి'ని వర్గీకరించ మనం ఎంతటివారం?

—**మరో అంశం**—

వ్యాసమహర్షి జనమేజయునికి చెప్పిన కాలం నాటి పవిత్ర స్థలాల పేర్లు, నేటి భారతంలో అనూహ్యంగా మారిపోయాయి. ఊహకు కూడా అసాధ్యమైనవి. నాటి సంస్కృత నామధేయాలు నేడు స్ఫురించుట లేదు. ఉదాహరణకు 'ఉజ్జయిని'ని ఆ రోజులలో 'అవంతికాపురి' అన్నారు. 'పురుహూతిక' నేటి పిఠాపురం అయింది. కొన్ని సంశయాస్పదంగా ఉన్నాయి.

దీనివల్ల వివిధ ప్రాంతాలలో ఆలయాలకు సంబంధించిన క్షేత్ర మహాత్మ్యాలు - స్థల పురాణాలు చదువుతూ ఉండగా, దేనికదే "ఇది శక్తిపీఠం" అనే వాక్యం పదేపదే కన్పించసాగింది. శంకించడానికి సాహసించలేం! పోనీ! సతీదేవి యొక్క ఫలానా శరీరభాగం ఇక్కడ పడింది అని నిర్దుష్టంగా ఆ స్థల మహాత్మ్యంలో వివరిస్తారు అంటే అదీ లేదు. "సతీదేవి యొక్క శరీరభాగం ఇచ్చట పడినది; అమ్మవారి ఆభరణ విశేషము ఇచ్చట పడినది" అని మాత్రమే అందులో ఉంటోంది.

ఈ గందరగోళం నుంచి నన్ను ప్రాచీన పండితులూ క్షేత్ర సందర్శన అపారంగా చేసిన యాత్రిక వరేణ్యులూ కొంతవరకు కాపాడారు చాలా క్షేత్రాలలో సతీదేవి శరీరభాగాలు ఏవేవి పడినవో సూచించారు. పేరుపేరునా పేర్కొనడానికి ఇక్కడ స్థలం చాలదు కనుక, వారందరికీ నా శతసహస్ర వందనపూర్వక కృతజ్ఞతలు.

ఎక్కువ శరీరభాగాలు, (ఇప్పటి భారతదేశపు సరిహద్దుల ప్రకారం) ఇతర ప్రాంతాలలో పడనప్పటికీ.... వాటిని కూడా విస్మరించకుండా తెల్సుకొని ఈ పుస్తకంలో చేర్చడం జరిగింది.

అయితే.... నేను సర్వజ్ఞుడనుగాను!

నిర్ధారణ విషయమ్మై, నా మూలంగా జరిగే పొరపాట్లు ఏవన్నా వుంటే, క్షమించవలసిందిగా విద్వద్వరేణ్యులను వేడుకొంటూ.... శెలవ్.



**దేవీ పీఠం : వారణాశి**
**దేవీ రూపం : విశాలాక్షి**

కాశీ (వారణాశి). పురాణాలలో చెప్పిన ప్రకారం, ఈ నగరం బ్రహ్మ సృష్టి కానందున, ప్రళయకాలమందు కూడా ఇది నాశనము చెందదని నానుడి. ఇక్కడి స్వామి జ్యోతిర్లింగ రూపుడైన విశ్వేశ్వరుడు కాగా, అమ్మవారు శక్తిపీఠాధిష్టాన దేవత అయిన విశాలాక్షి.

ఇది సతీదేవి వామహస్తం పడిన చోటుగా ప్రతీతి. ఈ అతి పురాతన పుణ్యక్షేత్రం సప్తమోక్ష పురాల్లో ఒకటి. (అనగా.... ఇచట మరణించిన వారికి పునర్జన్మ కలగదట!)

దివ్యసుశోభితములైన, విశాలమైన కన్నులు కలిగిన అనే అర్థంలో విశాలాక్షి స్వరూప మిచ్చట మనం దర్శించగలం!

వేదాంతపరమైన అర్థము ప్రకారం సచ్చిదానందకర ఘనీభూత జీవాత్మకమయిన విగ్రహం కలిగినది.

అసలు.... 'కాశీ' అంటేనే 'గొప్ప వెలుగు' అని అర్థం! నిజమే! పుణ్య లోకాలకు మార్గం చూపే వెలుగు కదా! వరుణ, అసి అనే నదుల పేరిట ఇది వారణాశి అయింది.

శక్తిపీఠ ప్రదేశం : వారణాశి

ఈ క్షేత్రం, ఉత్తరప్రదేశ్‌లోని కాశీ (వారణాశి) అనే పేర ప్రఖ్యాతమైనది. ఈ నగరం శివుని త్రిశూలం మీద నిల్చినదని ప్రతీతి. వారణాశి జిల్లా కేంద్రం నుండి ఈ శక్తిపీఠ ప్రదేశం (కాశీ) 8 కి.మీ. మణికర్ణికా ఘాట్ సమీపంలో ఉన్నది.

గంగానదీ తీరాన ఉన్న ఈ పార్వతి అమ్మవారిని సిరులిచ్చే శ్రీ మహాలక్ష్మిగా కొలిచే క్షేత్రం. అలాగే ఈ పరిసరాల్లో కాళి, గాయత్రి, తార, మంగళ తదితర దేవీరూపాల ఆలయాలున్నాయి.



**దేవీ పీఠం : నైమిశారణ్యం**
**దేవీ రూపం : లింగధారిణి**

నైమిశంలో పాండవులు కొలిచిన దేవీమూర్తి. లింగధారిణిగా, లలితగా భక్తులందరి కోరికలు సిద్ధింపచేసే అమ్మవారు. సూతుడు శౌనకాది ఋషులకు పురాణాలు

విన్పించిన ప్రదేశం. బహ్వాచోపనిషత్ ప్రకారం 'సర్వం మహా త్రిపుర సుందరీ సత్యమేకం లలితాఖ్యం వస్తు' అని చెప్పబడింది. ఆత్మప్రియమగునట్టి సౌందర్యమే లలితమని అదంతా మహాత్రిపుర సుందరీమయం అనీ విశేషార్థం.

శక్తి (ప్రకృతి) శక్తిమంతుల (ఈశ్వరుడు) కభేదమనడం శ్రుతి సమ్మతం. శక్త్యారాధనమే శక్తి మదారాధనం. శక్తిమంతుని పత్నిగా నెన్నబడిన తచ్ఛక్తియే జగన్మాత, ఆమెయే మహామాయా మూలప్రకృతి. కనుకనే ఆమె సర్వులకూ అరాధ్య. ఆమెయే సంవిద్ స్వరూప శుద్ధ విద్య.

అండ పిండ బ్రహ్మాండాదులలో సమిష్టిగాను, వ్యష్టిగాను కుండలినీ రూపంలో ఉన్న ఉపాస్యదేవతయే శ్రీలలిత.

ఈ బ్రహ్మశక్తికే మహాత్రిపురసుందరి అనీ, సౌభాగ్యదాయిని అనీ, శ్రీమాత అనీ, శ్రీవిద్యా అనీ నామాంతరాలు.

శక్తిపీఠ ప్రదేశం : నైమిశం

నైమిశారణ్యంలో భూతనాథుడు లలితాదేవి వెలసి ఉన్నారు. గోమతీ నదీ తీరంలో ఉన్న ఈ నైమిశారణ్యం రైల్వేస్టేషన్, బల్‌మవూ రైల్వే జంక్షన్‌కు 25 కి.మీ. దూరంలో ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో గల ఈ శక్తిపీఠ సందర్శనకు, రైలు/ బస్సు సౌకర్యాలున్నాయి. యాత్రికులు బస చేయడానికి తగిన వసతి ఉన్నది. ఇక్కడకు హాతియా 12కి మీ. దూరం.



## దేవీ పీఠం : **ప్రయాగ**
## దేవీ రూపం : **కుముద**

మహాభారత యుద్ధానంతరం, 18 అక్షౌహిణుల సైన్యం మాత్రమే గాక ముఖ్య బంధువులనూ, సన్నిహితులనూ కోల్పోయిన ధర్మరాజుకు మనశ్శాంతి కరువయింది. నిరంతరం వ్యాకులచిత్తుడైన ధర్మరాజుని ఊరడించి, మార్కండేయ మహర్షి ధర్మరాజును మనః ప్రశాంతత కోసం ఇక్కడికి పంపించాడు.

ఈ త్రివేణీ క్షేత్రంలో ఆయనకు మనశ్శాంతి లభించింది. నాటి నుంచి ఈ క్షేత్రాన్ని మనశ్శాంతి కోరేవారు దర్శిస్తూనే ఉన్నారు.

ఇక్కడ విగ్రహ రహితమైన, శ్రీచక్ర స్వరూపిణి (లలిత) అయిన అమ్మవారు మాధవేశ్వరిగా - కుముదా దేవిగా పూజింపబడుతున్నారు. కొందరు అలోపిదేవి అనీ మాయాదేవి అని కూడా పిలుస్తారు.

సతీదేవి హస్తాంగుళీయకం పడిన ప్రదేశం ఇది.

ఈ త్రివేణీ సంగమస్థానంలో పన్నెండేళ్ల కొకసారి కుంభమేళా ఉత్సవాలు జరుగుతాయి

శక్తిపీఠ ప్రదేశం : ప్రయాగ

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ నగరంలో ఉన్నది ఈ ప్రయాగ క్షేత్రం ఇది గంగ, యమున, సరస్వతి నదుల సంగమక్షేత్రం (త్రివేణీ సంగమం). ఈ మూడు నదులలో గంగ నీరు తెలుపు, యమున లేక కాళింది నీరు నలుపు, సరస్వతి అంతర్వాహిని అని చెబుతారు.

ఢిల్లీ నుండి వారణాసి మీదుగా; ఆగ్రా నుండి కూడా రైలు/ బస్సులున్నాయి. అలహాబాద్‌కు 3 కి.మీ. దూరంలో ఉన్నదీ క్షేత్రం



## దేవీ పీఠం : **గంధమాదన**
## దేవీ రూపం : **కాముకి**

గంధమాదన పర్వతం లేక నీలాచల పర్వతమని పిలువబడే ఈ క్షేత్రం గొప్ప శక్తిపీఠం. ఇక్కడ సతీదేవి యొక్క 'యోని' భాగం పడిందంటారు.

అలాగే శివుని కంటి మంటకు ఎర అయిన మన్మధుడు ఇక్కడే మసి అయ్యాడని కొందరంటారు. ఈ పర్వతం మీద కామదేవ, రతీదేవులకు ఆలయాలున్నాయి.

ఈ పర్వతం మీద వెలసిన అమ్మవారు, రాతిపై గల ముద్ర రూపంలో ఉండడం గమనార్హం!

ఇక్కడ అమ్మవారికి 'బహిష్ఠ' ఉంటుందని, ఆ నాలుగు రోజులనూ 'అంబుబాషి' రోజులనీ ఒక నమ్మిక. ఈ సమయంలో అమ్మవారిని ఎవరూ చూడకుండా, చుట్టుప్రక్కల గల నవగ్రహాలయాలతో సహా అన్నీ మూసేస్తారు. ఐదోరోజు ఆలయం తెరిచే సమయానికి అమ్మవారి మూర్తి క్రింద నుండి ఎర్రటి నీరు బైటికొస్తుంటుంది.

ఈ రోజుల్లో బాసుమతీ దేవి (ఇక్కడి వ్యవహారం ప్రకారం) పూజకు ఎర్రని పూలు, ఎర్రని వస్త్రం, కుంకుమ బదులు ఎర్రటి పసుపు వాడతారు. అమ్మవారు మంత్రతంత్ర దేవతగా కొలుస్తారు.

శక్తిపీఠ ప్రదేశం : గౌహతి

అస్సాం రాష్ట్రంలోని గౌహతి నగరానికి (రాష్ట్ర రాజధానికి) 8 కి.మీ. దూరంలో ఉంది.

బ్రహ్మపుత్రానదీ తీరం. దీనినే పురాణకాలమున 'ప్రాగ్జ్యోతిష్యపురం' అనేవారు. (ఇది అప్పట్లో కామరూప దేశం).

ఈ దేవాలయం గర్భగుడి చాలా క్రిందుగా ఉన్నందువల్ల, మెట్లు ఏర్పాటు చేశారు.

## దేవీ పీఠం : **దక్షిణ కైలాసం**
## దేవీ రూపం : **కుముదా దేవి**



అమ్మవారి కుడిపాదం పడిన స్థలంగా చెపుతారు. కుముద లేక మహాసుందరి పేరిట ఇక్కడ అమ్మవారు పూజలందుకుంటున్నది.

శుభలక్షణములు గల, మహామోహమున భక్తజనాళిని ఆకర్షించగల సుందర స్వరూపిణి. మోదము (సంతోషము) కలిగించు కుముదినీ (స్త్రీ) రూప విశేషంగల అమ్మవారు.

బ్రహ్మవిష్ణు మహేశ్వర రూపుడైన ఆదిదేవుని తాదాత్మ్యంలో ముంచెత్తే రూపధారిణి. కనుకనే ఆమెను త్రిపుర సుందరి. ఇక్కడ 'త్రి' శబ్దం త్రిమూర్తులకు సంకేతంగా గ్రహించాలి. (అ, ఉ, మ అనే అక్షర సంజ్ఞలు గల.... అని అర్థం!) ఈ త్రిపుర సుందరే కుముదిని.

ఈమెయే సర్వభక్త వశీభూత. సర్వోత్పాదక చిత్ శక్తి. తేజోమూర్తి.

సాధకులకు ఈ రూపం వేదాంతార్థ ప్రతిపాదకం. వైరాగ్యకారకం. సృష్టికారిణిగా మాత్రమేగాక సృష్టిహారిణిగానూ ఈ సుందరీ రూపం సర్వవిదితం.

శక్తిపీఠ ప్రదేశం : మానస సరోవరం

దక్షిణ కైలాసంగా పిలువబడే ఈ ప్రాంతం భారత్ టిబెట్టు సరిహద్దులో ఉన్నది. హిమాలయ పర్వత శ్రేణులలోకి విస్తరించిన ఎత్తయిన ప్రాంతం. ఇందులో భారత భూభాగం 321 కి.మీ. మానససరోవర యాత్ర అందరూ చేయలేరు. ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలించవు.

ఉత్తరప్రదేశ్‌లోని అల్మోరా పట్టణం నుండి ఇక్కడికి 300 కి.మీ. ఇక్కడికి అతి సమీపంలో ఉన్నది కైలాసగిరి. మానససరోవర్ నుండి కైలాసగిరి కేవలం 50 కి.మీ. మాత్రమే!

## దేవీ పీఠం : **గంధమాదన**
## దేవీ రూపం : **పర్వతవర్ధిని**

పర్వతరాజు కూతురైన పార్వతీదేవి, శివార్ధాంగిగా వెలసిన శక్తిపీఠం.

నిజానికి దేవీ భాగవతం ప్రకారం దేవి నామాలు అనంతం! శాంకరి, శుంభళ, చాముండి, పురుహూతిక, ఏకవీర, మాధవేశ్వరి, మాంగల్యగౌరి, విశాలాక్షి, గిరిజ.... ఇలా ఎన్నెన్నో నామధేయ ప్రవర్ధిని.

సృష్టిలోని సమస్త చరాచర వస్తువులన్నిటా అనిర్వచనీయ, అవ్యక్త చైతన్యాత్మకమైన అద్భుతశక్తి ఆవహించి ఉందన్నది ఆధ్యాత్మ విదుల - మహాయోగుల ఉవాచ. కేవలం చెప్పడమేగాక వారు ఆమెనే పరాశక్తి అనీ, పరమేశ్వర శక్తి అనీ, చిత్‌శక్తి అనీ ఈ పర్వత రాజపుత్రిని ఉపాసిస్తున్నారు.

మరికొందరు పార్వతీదేవిని పరాశక్తి స్థానంలో నిలిపి, ఆమెనూ ఆమె పతినీ కలిపి 'అర్ధనారీశ్వరం'గా ఆరాధిస్తారు.

శక్తిపీఠ ప్రదేశం : రామేశ్వరం

రామలింగేశ్వరుడు, పర్వతవర్ధినీదేవి వెలసి ఉన్న ఈ శక్తిపీఠ క్షేత్రంలో 4 కి.మీ. దూరంలోనే గంధమాదన పర్వతం పైన శ్రీరాముని పాదాల గుర్తులున్నట్టు చెపుతారు.

ఇక్కడ ఉన్న లింగాలు రెండు. 1. గంధమాదన లింగం (రామప్రతిష్ఠ) 2. అగస్త్య లింగం (మహర్షి ప్రతిష్ఠ). ఇవికాక అంజనేయుడు తీసుకొచ్చిన కాశీవిశ్వనాథ లింగం ఇంకో గర్భగుడిలో దర్శించవచ్చు! శక్తిపీఠం ఇక్కడ స్వామికి కుడివైపున ఉండడం ప్రత్యేకత.

దేవీ పీఠం : **గోమంత**
దేవీ రూపం : **గోమతి**

సతీదేవి వీపు భాగం పడిన చోటుగా గోమంతదేవీ పీఠం వెలిసిందంటారు. దుర్గా - కాళీ శక్తులతో కలసి వెలసిన తేజోవంతమైన ఈ అమ్మవార్ని శ్రీ కాంచన కాంతిదేవి అంటారు.

సృష్టికి మూలమైన ఆదిశక్తి దేవి, మొట్టమొదట శ్రీకృష్ణ పరమాత్మ చేత గో లోకంలో, బృందావనంలో, రాసమండలంలో పూజలందుకుంది.

కైటభుని సంహరింపచేయడంలో బ్రహ్మ, శక్తిని పూజించిన ద్వితీయస్థానం పొందాడు.


త్రిపురా సంహారార్థం శివుడు అంబను పూజించి తృతీయుడైనాడు

దేవిని అర్చించి చతుర్థ స్థానం పొందినవాడు దేవేంద్రుడు. ఆ తర్వాత మునులు, సిద్ధులు, దేవతలు, మనువు మొదలైన ప్రజాపతులు, మనువు వల్ల ఏర్పడిన మానవులు ఆమెను ఆరాధించినట్లు బ్రహ్మవైవర్త పురాణంలో ఉంది.

శక్తిపీఠ ప్రదేశం : భువన్‌పర్వత్

అస్సాంలోని కామరూప్ జిల్లాలో భువనకొండగా ఈ పీఠాన్ని పేర్కొనవచ్చు! ఈ కొండకు పూర్వనామధేయం శ్రీ పర్వతం అనీ అమ్మవారిని శ్రీ సుందరి అనీ వ్యవహరించే వారట!

ఇది గౌహతికి 60 కి.మీ.; సిల్‌చార్ నుండి 20 కి మీ దూరంలో ఉంది.



**దేవీ పీఠం : మందర**
**దేవీ రూపం : కామచారిణి**

'హరార్థం ధ్యాయే ద్యో హర మహిషి తే మన్మధ కలాం' అని సౌందర్యలహరిలో చెప్పినట్లు ఇది 'మదన స్త్రీ' ప్రయోగం. దేవనాగర లిపి ప్రకారం క్లీం (....) అనే కామబీజం జపించేటపుడు పై బొట్టు ముఖం; 'క' కారంలో రెండు వంపులు కుచములుగా; 'ల' కారం ధ్యాన సాధకుడుగా గ్రహిస్తే అంతరార్థం బోధపడుతుంది.

ఈ శివశక్తి సంయోగము అయిన జగత్తే త్రిగుణాత్మకం. శక్తి త్రిగుణాత్మక.

శివుడు బిందువు. శక్తి రెండు బిందువులు. విసర్గాత్మకం. మొత్తం 3 బిందువులు. (ం ః)


ఇదొక సంకేత తాంత్రిక రహస్యం. ఇచ్ఛాశక్తిదము.

వివాహం కావలసివున్న కన్యలు ప్రార్థిస్తే, త్వరలోనే ఈ అమ్మవారి కృపవల్ల వారికి పెళ్లిళ్లు జరిగేలా వరం ఇస్తుందని నమ్మిక.

శక్తిపీఠ ప్రదేశం : మాంగాడు

మద్రాసు (చెన్నయ్)కు కేవలం 20 కి.మీ. దూరంలో ఉన్న ఈ శక్తిపీఠ ప్రదేశంలో అమ్మవారు కామచారిణి.

పార్వతిగా ఉన్నప్పుడు 'కామ' (పతిని కోరే ప్రయత్నమున) 'చారిణి' (చరించు.... తపమాచరించునది) అయి, అందు సఫలీకృతురాలై శివ సహధర్మచారిణి అయినదని ఐతిహ్యం అమ్మవారు ఇక్కడే మామిడి తోటలో అగ్నిహోత్రం పైన కూర్చొని గొప్ప తపస్సు చేసినదట!



## దేవీ పీఠం : చైత్రరథ
## దేవీ రూపం : మదోత్కట

సతీదేవి కుడి తొడభాగం పడిన ప్రదేశంగా ఈ ప్రదేశాన్ని పేర్కొంటున్నారు ఒకప్పుడు ఇక్కడ వసంతకాలం రథాల మీద పరుగులు తీస్తోందా అన్నంత నయనానందకరంగా వనాలుండేవి. వసంతోదయవేళ చైత్రంలో ఇక్కడ రసరమ్యవనాలు ఉల్లాసకర వాతావరణం కల్పించేవి. ప్రస్తుతం నగరం పెరిగి అవన్నీ కనుమరుగయ్యాయి.

చిత్రరథుడు అంటేనే మదనుడు. (మన్మధమూర్తి). అతడి ఉత్కటం (చెలరేగటం) వసంతంలోనే.

ఇక్కడే పార్వతిని తొలిసారిగా శివుడు చూసి మన్మధ ప్రేరితుడయ్యాడని ఒక ఐతిహ్యం.

శ్రీదేవీ కామకళారూపం 'ఈం' (....) బీజం. శివుడు అకర్షితుడైనందున పార్వతిని చేరి ఈః + వరుడు అయినట్లు భావన.

శక్తిపీఠ ప్రదేశం : పాట్నా

బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో (రైల్వేస్టేషన్) మహరాజ్ గంజ్ అనేచోట పాట్నాకు 9 కి.మీ. దూరంలో పెద్దపటాన్ దేవిగా వెలసిన అమ్మవారు.

అలాగే రైల్వేస్టేషన్ నుండి 3 కి.మీ. దూరంలోని సిటీచౌక్‌లో చిన్న పరాన్‌దేవి వెలసి వున్నది.

చాలా ప్రాచీన అలయాలు. ఇప్పటికీ ఇక్కడ రాత్రంతా తైలంతోనే దీపాలు వెలిగించే అచారం ఉన్నది. (విద్యుత్తు ఉన్నప్పటికీ).



## దేవీ పీఠం : హస్తినాపురి
## దేవీ రూపం : జయంతి

జయాన్ని కలిగించే దేవి కనుక జయంతి అని సామాన్యమైన అర్థం. మన దుఃఖాలు దూరం కావాలన్నా, యుద్ధంలో జయం పొందాలన్నా, అసాధ్యమైన పనులు సాధించాలన్నా జయంతీ రూప ఆదిశక్తిని పూజించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.

"ఈషత్సంధ్యామతి క్రాంతః కించిదుద్భిన్న తారకః విజయో నామకాలోయం సర్వకార్యార్థ సిద్ధయః" అనే శ్లోక ప్రమాణం ప్రకారం.... సాయం సంధ్య దాటి నక్షత్రాలు ఆకాశంలో కనుపించే వేళను విజయకాలం అంటారు. ఇది సకల కార్యజయాన్ని కల్గిస్తుంది.

ధర్మసింధువు ప్రకారం విజయార్థి ఇట్టి సుముహూర్త కాలాన్ని ఎంపిక చేసుకోవాలి. అమ్మవార్ని అర్చించి ముందుకు సాగాలి. విజయం తథ్యం.

శక్తిపీఠ ప్రదేశం : ఢిల్లీ

నాటి పాండవుల రాజధాని హస్తినాపురమే, నేటి మన దేశ రాజధాని ఢిల్లీ. దాదాపు 5000 సం॥ల అతి దీర్ఘచరిత్రగల నగరం.

భారతదేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ఇక్కడికి రైలు సౌకర్యం ఉంది. ఇది యమునా నదీతటాన విలసిల్లుతున్నది.

ఢిల్లీ నగర సమీపంలో ఉన్న కళికా గ్రామంలో ధర్మరాజు చేత ప్రతిష్ఠమైన కాళికయే 'జయంతి' అనే పేర శక్తిపీఠంగా వెలసింది. ఇది ఢిల్లీ నుండి 15 కి.మీ. మాత్రమే!! భారతయుద్ధానికి ముందు జరిగిన ప్రతిష్ఠ ఇది.



## దేవీ పీఠం : కన్యాకుబ్జ
## దేవీ రూపం : గౌరి

'గౌరి' అనగా రజస్వల కాని కన్య. నెల అని ఇంకో అర్థం కూడా ఉంది. గౌరీపూజ వివిధ ప్రాంతాలలో వివిధ రీతుల్లో ఆచరించబడటం మనం చూస్తున్నదే!

కొన్ని వరి మొక్కల్ని, ఒక కన్నెపిల్లని గౌరిగా పూజించేవారు; గోమయం గొబ్బెమ్మలుగా చేసి పూజించేవారు; బతకమ్మలనే పేరిట ఇదే పూజ మరో విధంగా ఆచరించేవారూ అంతర్భావంలో గౌరినే ఆరాధిస్తున్నారు

'అష్టవర్షా భవేత్ గౌరీ' అనే శ్రుతి ప్రకారం ఏనిమిదేళ్ల కన్యకను గౌరిగా అర్చించే ఆచారం నేటికీ పశ్చిమ బెంగాల్‌లో ఉంది.

స్త్రీలకు సౌభాగ్య ప్రదాయినిగా, సకల శుభాలను కలిగించే అమ్మవారిగా దేశమంతటా గౌరీ ఆరాధన ఉన్నది.

గౌరి పాడిపంటలను, సిరిసంపదలను ఇచ్చి చల్లగా చూస్తుందన్నది సత్యం.

**శక్తిపీఠ ప్రదేశం : కనోజ్**

ఉత్తరప్రదేశ్‌లోని ఫరూకాబాద్ జిల్లాలో ఉన్న కనోజ్‌లో గౌరీదేవిగా వెలసిన అమ్మవారు ఈ శక్తిపీఠంలో సంస్థితయై ఉన్నది. ఒకప్పుడు ఇది 'కన్యాకుబ్జము' అనే పేరు సుప్రసిద్ధము. ఇక్కడే సింహవాహిని, మహాత్రిపుర సుందరి ఆలయాలు కూడా దర్శించవచ్చు!

రాష్ట్ర రాజధాని లక్నో నుండి నేరుగా ఇక్కడకు బస్సు సౌకర్యం ఉంది

దేవీ పీఠం : మలయాచల
దేవీ రూపం : రంభ

అమ్మవారు ఇచ్చట 'సుగంధ కుంతలాంబిక'గా పూజలందుకుంటున్నది.

కర్పూరయుక్తమగు సౌరభ్యము (సుగంధం) కలిగిన కేశములచే ప్రకాశించు అమ్మవారు, ఈ పరిమళం చేత జగత్తునంతటినీ సురభిళం చేస్తున్నదని ఈ స్వరూపాతిశయోక్తి ద్వారా వ్యక్తం అవుతున్నది. అనగా స్వర్గభోగప్రదాయిని కూడా ఈమెయే!

గుణసూత్రార్థం అవలోకిస్తే సుగంధ చికురాలనే పదం యొక్క ఉపలక్షణత్వం వల్ల ఒక సాజాత్యం మనకు స్ఫురిస్తుంది. అదే.... దివ్య పరిమళం.

దీనికి లలితా త్రిశతీ భాష్యంలోనూ ఈ శ్లోక పాదాన్ని ఉదాహరించవచ్చు. "ఏలా సుగంధి చికురా చైన కూట వినాశినీ...."

శక్తిపీఠ ప్రదేశం : తిరుచినాపల్లి

తమిళనాడులోని తిరుచానాపల్లినే, నోరుతిరగక అంగ్లేయులు 'ట్రిచి' అని పిలిచేవారు.

ఇక్కడి రాక్‌ఫోర్ట్ కొండలో కొలువైన మాతృభూతేశ్వరుడు స్వామివారు. కాగా అమ్మవారు సుగంధికుంతల.

తంజావూరు జిల్లా కేంద్రం నుండి ఇక్కడకు 52 కి.మీ. రావణాసురుని తమ్ముడైన త్రిశిరుని పేరు మీదుగా వెలసిన త్రిశిరపల్లి. కాలక్రమంలో తిరుచినాపల్లి అయిందంటారు. శ్రీరంగం ఇక్కడకు 10 కి.మీ. దూరం మాత్రమే!



**దేవీ పీఠం : ఏకామ్రక**
**దేవీ రూపం : కీర్తిమతి**

ఇది ఆదికాలం నుండే పరమేశ్వరీ దేవీ పీఠంగా విలసిల్లింది.

సర్వమంగళ మాంగల్యే - శివే సర్వార్థ సాధకే ।

శరణ్యే త్రయంబకే దేవీ - నారాయణినమోస్తుతే ॥

అనే దుర్గాసప్తశతి శ్లోకం ప్రకారం ధనం, భోగం, కీర్తిప్రతిష్టలు .. అన్నీ కలిగించే శివసతి (కీర్తిమతి)కి నమస్కరించాలి!

సర్వమంగళములు కలిగించునది సమస్త అభీష్ట వరదాయిని కీర్తిప్రద హరిహర బ్రహ్మేంద్రాదుల చేత అర్చించబడినది ముల్లోకాలను కుటుంబంగా కలిగినట్టిది పరమేశ్వరి.

ఇట్టి జగజ్జననిని కొలిచి పాండవులు, శ్రీరామచంద్రుడు తదితరులు తాము తలపెట్టిన మహత్తర కార్యాలలో విజయులై, కీర్తివంతులయ్యారు.

శక్తిపీఠ ప్రదేశం : కంచి

తమిళనాడులోని కంచి క్షేత్రంలో వెలసిన అమ్మవారు. ఇది మద్రాసు (చెన్నయ్)కు 70 కి.మీ. దూరమున ఉన్నది. చెంగల్పట్టు జిల్లా.

ఇక్కడకు అన్ని ప్రాంతాల నుండీ బస్సు సౌకర్యము గలదు.

ఈ క్షేత్రమున స్వామివారు ఏకామ్రేశ్వరుడు, పంచభూత లింగాల్లో ఒకటిగా విలసిల్లుతున్న పృథ్వీలింగం కూడా! ఈ శైవక్షేత్రంలో పాండవదూతగా వెళ్లిన శ్రీకృష్ణునికి సైతం ఆలయం ఉండడం ఒక ప్రత్యేకత.



## దేవీ పీఠం : విశ్వ
## దేవీ రూపం : విశ్వేశ్వరి

లలితా త్రిశతియందు సకల 'హ్రీం' అనే తృతీయ (శక్తి) ఖండమున హ్రీం శబ్దం ద్వారా జగన్మాత యొక్క విశ్వేశ్వరీ రూపం వేదాంతపరంగా చెప్పబడి వుంది.

భాష్యకారులు వివరించే అంతరార్థం ప్రకారం 'హ్రీం' సంహారశక్తి. కాని 'ఈః' అను శబ్దం సృష్టి శక్తి. అట్లే 'ఈ' శబ్దము సర్వ నియంతృత్వం కలది. హ్రీః + ఈః = హ్రీ, "ప్రకాశ రూపమైన" అనే అర్థంలో స్థిరపడి, నిరతిశయానంద సత్యానంద ప్రకాశాదాత్మక చిచ్ఛక్తిగా భాసిస్తున్నది.

సూటిగా చెప్పాలంటే  సర్వ ప్రపంచముల సృజనకు మూల భూతత్వము చెప్పబడినది.

కనుకనే విశ్వేశ్వరుని హ్రీంకార వేదోపనిషదే నమః అని ప్రస్తుతించారు.

శక్తిపీఠ ప్రదేశం : కాశీ

ఉత్తరప్రదేశ్‌లోని కాశీ క్షేత్రం. వారణాసికి 8 కి.మీ. దూరంలో ఉన్నది. గంగాతీరాన ఉన్న విశ్వేశ్వరీ మాతను దుర్గామాతగా ఆరాధిస్తారు.

ఈ ఆలయ ప్రాంగణమంతా కోతులతో నిండి ఉండుట చేత 'మంకీ టెంపుల్'గా పిలువబడుతోంది. ఈ ఆలయం ఎర్రటి గంగ సిందూరంతో నిండి ఉంటుంది. పండగ సమయాల్లో మేకలను బలి ఇచ్చే అచారం ఉంది. నదిలో పడవల ద్వారా ఇక్కడకు చేరవచ్చు!



## దేవీ పీఠం : పుష్కర
## దేవీ రూపం : పురుహూత

ఒక్కొక్క ప్రాంతంలో దేవికి ఒక్కొక్క నామం బహుళ ప్రచారంలో ఉంటుంది. అయితే - ఆరాధించబడే రూపం మాత్రం ఒకటే! అసలు - దేవి అంటేనే నామ రహితత్వం. అటువంటి దేవికి రూపాలు కల్పించినదీ మనమే! పురుహూత, శాంభవి, త్రినయని, భైరవి, భగవతి, శివాణి, చంద్రమౌళీశ్వరి.... ఇలా అన్నీ ఆమె రూపాలే!

ఆంధ్రదేశంలోని అరుదుగా ఉన్న శక్తిపీఠాలలో పురుహూత రూపం ప్రశస్తం' కారణం... ఇక్కడి ఆదిశక్తి అనాది.

కానీ, చిత్రంగా.... ప్రస్తుతం ఇక్కడ దేవీ పీఠస్థానం ఏ ప్రదేశంలో స్పష్టంగా చెప్పలేని పరిస్థితి.

శక్తిపీఠ ప్రదేశం : పిఠాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిఠాపురం, ప్రాచీన కాలంలోని పురుహూతిక నగరం. తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడకు సామర్లకోటకు దగ్గర్లో ఉన్నది.

తాంత్రిక పూజలు జరిగే కాలంలోనే, అమ్మవారి అసలు విగ్రహం మాయమైందనీ నేటికీ కనిపించడం లేదనీ చెప్తుంటారు.

అయినప్పటికీ - శక్తి పీఠంగా శ్లోకంలో పేర్కొనబడుతున్న అమ్మవారు రాజ్యలక్ష్మిగా (కుక్కుటేశ్వరాలయం) ఇక్కడ పూజలందుకొంటున్నది.



## దేవీ పీఠం : కేదార
## దేవీ రూపం : మార్గదాయిని

కేదార పీఠం, సముద్ర మట్టానికి 3,580 మీ. ఎత్తులో ఉంది. దేవాలయం చాలా అందంగా ఉంటుంది. కేదారేశ్వరుని సన్నిధిన వెలసిన అమ్మవారు శక్తి పీఠేశ్వరి. కాగా స్వామివారు జ్యోతిర్లింగ రూపుడు. ఆకాశం నిర్మలంగా ఉంటేనే తప్ప (మంచు ప్రభావం లేకుండా) దర్శనం లభించదు.

ఈ పీఠంలో  మహాభారత యుద్ధానంతరం పాపపరిహారార్థం పాండవులచే ప్రతిష్ఠించబడిన స్వామివారు ఈయన.

ఆలయం శిల్ప రమణీయం  గర్భగుడిలో లక్ష్మీనారాయణుల విగ్రహాలు కూడా దర్శించవచ్చు!

ఆలయప్రాంగణంలోనే వెలసి వున్న ఒక బ్రహ్మాండమైన నంది విగ్రహం ప్రత్యేక ఆకర్షణ.

శక్తిపీఠ ప్రదేశం : కేదారనాథ్

మందాకినీ నదీతీరాన ఉన్న కేదారేశ్వరుడి పత్నిగా, కేదార శక్తిపీఠమున మార్గదాయిని అయి, అమ్మవారు ఇచ్చట పూజలందుకుంటున్నది.

ఢిల్లీ నుంచి హృషీకేశ్ వరకూ బస్సులోను; అక్కడ నుండి గౌరీకుండ్ మీదుగా కాలినడకన (14 కి.మీ.) కేదారనాథ్‌కు చేరుకోవచ్చు!

నిజానికి కేదారనాథ్ యాత్ర గౌరీకుండ్ నుంచే ప్రారంభం అయినట్లు గుర్తిస్తే, ఈ శక్తిపీఠ క్షేత్రం మార్గదాయిని అనే పేరుకు సార్థకత చేకూర్చినట్లుగా భావించాలి.





## దేవీ పీఠం : హిమవత్
## దేవీ రూపం : నంద

నందాదేవి పర్వత సీమలో పవిత్రనందా పీఠం ఉంది. ప్రతి పన్నెండేళ్ల కొకసారి నందాదేవి స్వర్ణ విగ్రహాన్ని రాజజయయాత్ర పేరిట కర్ణప్రయాగ నుంచి రూప్‌కుండ్ మీదుగా ఈ హిమవన్నగ చరణ సీమకు తీసుకొస్తారు. యాత్రికులు అధిక సంఖ్యలో నందాదేవిని దర్శించేది అప్పుడు మాత్రమే!

ప్రకృతి దృశ్యాలను ప్రేమించే వారికి, ఈ గిరిశిఖరాలు గొప్ప ఉత్తేజాన్ని కలిగిస్తాయి. కాని ఇక్కడ చలిగాలుల స్వైర విహారానికి బలహీన యాత్రికులు తట్టుకోవడం చాలా కష్టం!

పైగా మార్గంలో ఎన్నో ఏటవాలు శిఖరాలు ఎక్కి దిగి ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉంటుంది.

శక్తిపీఠ ప్రదేశం : నందాదేవి శిఖరం

ఇది హిమాలయ పర్వత శ్రేణుల్లో దాదాపు 70 హిమోన్నత గిరిశిఖరాలతో అలరారుతోంది.

మంచు ప్రభావంవల్ల అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా (ఆరోగ్యవంతులు సైతం) ఈ యాత్రను, మే జులై మధ్య చేయడం ఉత్తమం.

ఇక్కడకు చేరడానికి ఢిల్లీ నుంచి జోషిమఠ్ వరకు బస్సులో ప్రయాణించినా, ఇక్కడకు సమీపంలోని లాటా నుంచి మజిలీలు చేసుకుంటూ, కనీసం 7 రోజులకు తక్కువ కాకుండా ప్రయాణం ఉంటుంది. ఖరక్ నుంచి ధరన్సీ వరకు కఠినతర ఏటవాలు శిఖర ప్రయాణం. తరువాత లోయలో ఉన్నదీ ఆలయం.

## దేవీ పీఠం : గోకర్ణం
## దేవీ రూపం : భద్రకర్ణిక

బృహ్వచోపనిషత్ షోడశ విద్య పంచదశాక్షరిని వివరించి, భద్రకర్ణిక లేక బాలాంబిక, మాతంగి, స్వయంవర కల్యాణి, భువనేశ్వరి, వారాహి, రాజమాతంగి, శుకశ్యామల, అశ్వారూఢ, ప్రత్యంగిరా, బ్రహ్మానంద కళా అని ఆదిశక్తిని కీర్తించింది.

శైవులు, వైష్ణవులు, బౌద్ధులు.... ఇలా పలు ఆరాధకులున్నప్పటికీ అందరికీ దేవీ ఉపాసన ఉన్నది. పేర్లు తేడాగా కన్పిస్తాయి.

దేవి సకల శక్తి సమన్విత. ధర్మార్థ కామమోక్ష ప్రదాత్రి. భక్తులు ఏ అభీష్టాన్ని అర్థించి, ఏ తీరుగా ఆవిడను ఉపాసిస్తే ఆ రూపం దాల్చి ఆయా వాంఛితార్థాలను నెరవేరుస్తుంది.

శక్తిపీఠ ప్రదేశం : గోకర్ణ క్షేత్రం

'భూకైలాసం' అని పేరుగాంచిన ఈ క్షేత్రంలో స్వామివారు మహాగోకర్ణేశ్వరుడు, అమ్మవారు తామ్రగౌరిగా పూజలందుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఉన్నదీ క్షేత్రం. (ఉత్తర కన్నడ జిల్లా). ఇది హుబ్లీ నుండి 120 కి.మీ. దూరంలోను; కార్వార్ నుండి 56 కి.మీ. దూరంలోను; ఉడుపి నుండి 200 కి.మీ. దూరంలోను ఉంది.

అరేబియా సముద్రతీరంలో వెలసిన ఈ శక్తిపీఠ ప్రదేశంలో వినాయకుడు, వెంకటేశ్వర స్వామి తదితర దేవతల ఆలయాలు కూడా దర్శించగలం!



## దేవీ పీఠం : స్థానేశ్వరం
## దేవీ రూపం : భవాని

సతీ అమ్మవారి త్రినేత్రంలో ఒకటి ఇక్కడ పడినదంటారు.

ఈ శక్తిపీఠ క్షేత్రంలోని ఒక ప్రత్యేక గదిలో ఒక పాన్పు ఏర్పరచి, అమ్మవారిని వరుసగా కొన్ని రోజులు (అలసట తీరి, విశ్రాంతి పొందే నిమిత్తం) నిద్ర పుచ్చుతారు. ఆ సమయంలో కూడా అమ్మవారిని నిద్రాభంగం కలిగించకుండా నిశ్శబ్దంగా దర్శించవచ్చు! నిద్రలేచిన ప్రతిసారీ మేకను బలి ఇస్తారు. సంవత్సరంలో 3సార్లు ఇలా విశ్రాంతి తీసుకోవడం జరుగుతుంది.

ఈ క్షేత్రంలో, దేశంలోని అన్ని ముఖ్య నదీ జలాలతో నింపబడిన గుండం ఉన్నది. బ్రహ్మదేవుని ఆజ్ఞ ప్రకారం ఏర్పరచబడిన ఈ గుండంలో స్నానం సర్వ రోగనివారిణి. మోక్షప్రదాయిని కూడా!

**శక్తిపీఠ ప్రదేశం : తుల్జాపూర్**

మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలో తుల్జాపూర్ నందు వెలసిన భవానీ మాత శక్తిపీఠాన్ని అలరించింది.

ఉస్మానాబాద్ నుండి 19 కి.మీ. తుల్జాపూర్‌కు షోలాపూర్ నుండి బస్సు సౌకర్యం ఉంది - 40 కి.మీ. దూరం.

సిద్ధేశ్వర (స్థానేశ్వర) మహాదేవుని పత్నిగా, తుల్జామాతగా ఆరాధింపబడే ఈ అమ్మవారే ఛత్రపతి శివాజీకి వీరఖడ్గాన్ని ప్రసాదించిందని చెపుతారు. మహిమగల ఈమెకు అష్టభుజములు ఆయుధాలు కలవు.



## దేవీ పీఠం : బిల్వక
## దేవీ రూపం : బిల్వపత్రక

"అమంగళానాం శమనీం శమనీం దుష్కృతస్యచ
దుస్వప్న నాశనీం ధన్యాం ప్రపద్యేహం బిల్వశుభాం"

మారేడు దళాలు శివునికీ శివసతికీ అత్యంత ప్రీతి పాత్రమైనవి. లింగ పురాణంలో బిల్వదళ ప్రశస్తి చెప్పబడింది.

అట్టి బిల్వపత్రాల చేత దేవిని అర్చించడం; లౌకిక - పార లౌకిక సుఖాల కోసం జగన్మాతను ఆరాధించడం; తద్వారా కలిగిన సంపద శక్తులను సమాజ శ్రేయస్సుకోసం వినియోగించడం సిద్ధులు చేసే మహత్తర కార్యం.

ఎవరికి వారు తమ తమ ఇష్టకామ్యార్థ సిద్ధి కోసం బిల్వ దళాలతో అర్చించడం ఇంకొక రీతి. కొన్ని ప్రాంతాలలో వృక్ష దేవతగానూ బిల్వం పూజించబడుతోంది.

**శక్తిపీఠ ప్రదేశం : కదిరి (మంగుళూరు)**

అమ్మవారు కర్ణాటక రాష్ట్రంలోని, అరేబియా సముద్ర తీరాన దక్షిణ కెనరా జిల్లాలో 'మంగళాదేవి'గా పిలువబడే బిల్వక శక్తిపీఠ సంస్థితయై వెలసింది. అదృష్ట దేవతగా ప్రజలచేత పూజలు అందుకొంటున్న ఈ బిల్వ పత్రక క్షేత్రం ఉడుపి నుండి 60 కి.మీ.

ఇది మాగడి మీదుగా బెంగుళూరుకు 92 కి.మీ. దూరంలో ఉన్నది. గ్రామ దేవతగా కూడా ఈమే అరాధింపబడటం మరో విశేషం.



## దేవీ పీఠం : శ్రీశైలం
## దేవీ రూపం : మాధవి

సతీదేవీ కంఠభాగం ఇక్కడ పడినట్లుగా చెపుతారు. అరుణాసురుడనే రాక్షసుని అమ్మవారు ఈ ప్రదేశంలో వధించినట్లు ప్రతీతి. ఇదే శ్రీశైలం.

'దక్షిణ కైలాసం' అని కొందరు, 'దక్షిణ కాశి' అని కొందరు అభివర్ణించే ఈ శక్తిపీఠ క్షేత్రములో, శ్లోకం ప్రకారం (భ్రమరాంబ అనబడే) మాధవీదేవి ఆరాధించబడుతున్నది.

ఆదిశంకరాచార్యులు ఇక్కడ తపస్సు చేసినట్లు; సౌందర్యలహరీ స్తోత్రం ఇక్కడే రచించినట్లు.... (కొందరు 'కనకధారా స్తోత్రం' అంటారు) చెప్పబడుతున్నది.

పూజారి లేకుండా స్వామివారిని పూజించే ఆచారం ఇక్కడ ఉన్నది. దగ్గరలో హాటకేశ్వరస్వామి ఆలయం కూడా దర్శించదగినది.

శక్తిపీఠ ప్రదేశం : శ్రీశైలం

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో నందికొట్కూరు తాలూకాలో ఉంది శ్రీశైల దేవీ పీఠం.

ఇది నల్లమలకొండల్లో ఉంది. మాచర్ల దాకారైల్లో వెళ్లవచ్చు! డోర్నాల నుండి ఘాట్ రోడ్డులో 51 కి.మీ. హైదరాబాద్ నుండి బస్సులో నేరుగా వెళ్లవచ్చు! అహోబిలము 160 కి.మీ. స్వామివారు మల్లికార్జునుడు. ఈ లింగం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాల నుండి బస్సులో ఇక్కడకు చేరగలం!



## దేవీ పీఠం : భద్రేశ్వర
## దేవీ రూపం : భద్ర

అమ్మవారి దక్షిణ పిరుదు పడిన ప్రదేశంగా భావిస్తున్నారు. అమ్మవారిని భద్రసేనగా అర్చిస్తారు.

స్వామివారు అమరనాధుడు.

భద్రేశ్వరి చక్కదనం సౌందర్యలహరిలోని ఒక శ్లోకములో ఎంతో సహజంగా వర్ణితమైంది.

"అమ్మా! ఈశ్వరీ! బ్రహ్మ మొదలగు శివజ్ఞాన దురంధరులు సైతం నీ చక్కదనానికి సాటి చెప్పలేక పోతున్నారు. ఎందుకంటే.... అలా సాటి చెప్పదగ్గ దేవతా స్త్రీల్లే నీ చక్కదనాన్ని అదే పనిగా ఆత్రంతో చూస్తూ, తపస్వులకు సైతం దుర్లభమైన శివసాయుజ్యం పొందుతున్నారు. (అదే ఇక్కడ చమత్కారం!) ఆవిధంగా నీ దర్శనం కోసం నిన్ను చూడదగిన శివుడు కూడా భక్తుల చేత స్మరించబడుట చేత, వీరికి శివైక్యం భద్రంగా లభిస్తున్నది."

**శక్తిపీఠ ప్రదేశం : అమర్‌కంటక్**

మధ్యప్రదేశ్‌లోని షాదోల్ జిల్లాలో అమర్‌కంటక్ వద్ద ఈ శక్తిపీఠ ప్రదేశాన్ని మనం దర్శించగలం!

ఇది జిల్లా కేంద్రానికి 100 కి.మీ. దూరంలో ఉంది. బిలాస్‌పూర్‌కు 49 కి.మీ.

నర్మద, శోణ నదులకు జన్మస్థలమైన ఈ అమర్‌కంటక్. తూర్పుగా పుట్టి పశ్చిమంగా ప్రవహించడం ఈ నది ప్రత్యేకత. జిల్లా కేంద్రం నుండి బస్సు సౌకర్యం కలదు.



## దేవీ పీఠం : వరాహశైల
## దేవీ రూపం : జయ

జయదుర్గాదేవి ప్రతి హస్తంలోనూ ఒక్కో ఆయుధం ఉంది. త్రిశూలం, ఖడ్గం, చక్రం, శక్త్యాయుధం, ధనుస్సు, పాశం, అంకుశం, కటకం.... ఇవన్నీ అసురత్వంపైన విజయం సాధించడానికే!

దేవి జగత్తును సృష్టిస్తుంది. పాలిస్తుంది. జయించాలన్న ఇచ్ఛ కూడా దేవీ రూపమే! అందుకే ఆమెను విజిగీష అన్నారు. మహిష, త్రిశిరాది రాక్షసులను మర్దించడం ద్వారా విజయస్వరూపిణి.

దుర్గుడనే దైత్యుడిని కూడా వధించిన దుర్గాధ్యానం విజయదాయకం!

సింహస్కంధ సమారూఢాం    నానాలంకార భూషితాం
చతుర్భుజ మహాదేవీం    నాగయజ్ఞోపవీతనీం ।
రక్తవస్త్ర పరీధానం    బాలార్క సదృశం తనూం
నారదాద్యైః మునిగణైస్సేవితానాం అంబాగ గౌహినీం ॥

**శక్తిపీఠ ప్రదేశం : బారాముల్లా**

ప్రాచీనకాలంలో 'వరాహమూల' అని పిలువబడే ఈ ప్రాంతం, కాలక్రమేణ ముస్లింల దురాక్రమణకు గురై నేడు బారాముల్లాగా మారిపోయింది అంతేకాదు! చాలా దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయి. వరాహరూపుడైన పరమేశ్వరుడు విజయం సాధించిన అనంతరం (జయ) లక్ష్మీ సమేతుడై ఇక్కడే తొలిసారి దేవతలకు దర్శనం ఇచ్చినట్లు చెపుతారు. జమ్ము&కాశ్మీర్ రాష్ట్రంలో రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌కు అతి చేరువగా ఉన్నది బారాముల్లా.



## దేవీ పీఠం : కమలాలయ
## దేవీ రూపం : కమల

'కమలాలయం' అనే కోనేరు ప్రక్కన వెలసిన అమ్మవారు ఈ శక్తిపీఠ సంస్థితయై విరాజిల్లుతున్నది.

ఇక్కడి స్వామి వల్మీకనాధుడు. ఆలయంలో పెద్ద పుట్ట ఉన్నది. ఇక్కడ వెయ్యి స్తంభాల మంటపం కూడా ఉంది. అతిపెద్ద రథంగల దేవాలయంగా ప్రసిద్ధి. స్వామివారి నీడ ఎప్పుడూ తూర్పుభాగాన మాత్రమే కనిపించడం విశేషం. ఆరు నెలల్లో మరణం ఉన్నచో నీడ కన్పడదట!

ఇక్కడ  ఇంకో విశేషం కూడా ఉన్నది. వల్మీకనాధుని ఎదురుగా (కమలాయతాక్షి ఆలయం మొదలు) నవగ్రహాలన్నీ ఒకే వరుసలో కొలువుదీరి స్వామివారి వైపే చూస్తున్నట్లుగా ఉంటాయి. ఇటువంటి నిర్మాణం ఇంకెక్కడా కనిపించదు.

**శక్తిపీఠ ప్రదేశం : తిరువారూర్**

తమిళనాడు రాష్ట్రంలోని, తంజావూర్ జిల్లాలో, తంజావూరుకు 40 కి.మీ. దూరంలో; నాగపట్టణానికి 20 కి.మీ. దూరంలో ఉన్నది ఈ శక్తిపీఠం.

అమ్మవారు చాలా మహిమగలదని  దయా సముద్రురాలని వివరించే స్థల పురాణాలు ఇక్కడెన్నో ప్రచారంలో ఉన్నాయి.

మహాభక్త శిఖామణి, వాగ్గేయకారుడు, కర్ణాటక సంగీతానికి ప్రాణప్రతిష్ఠ చేసిన త్యాగయ్య జన్మస్థలం ఇది.



దేవీ పీఠం · **రుద్రకుటి**
దేవీ రూపం : **రుద్రాణి**

సతీదేవి పాదాల వ్రేళ్లు ఇక్కడ పడినట్లుగా చెప్తారు.

రుద్రాణి కేవలం శివార్థాంగిగానే కాక త్రిమాతాత్మక మూర్తి. ఈమె హ్రీంకార జప సౌఖ్యదాయిని. త్రిమూర్తుల ఏకీభావ రూపమును కలిగినది.

"యదాహ్యేవైష ఏ తస్మిన్ మదృశ్యేనాత్మ్యేని రుక్తె నిలయనే భయం ప్రతిష్ఠాం విందతే అధసోభయం గతో భవతి" (తైత్తిరీయోపనిషత్) అనే మంత్రం ప్రకారం అదృశ్య, లింగశరీర శూన్య, శబ్ద నిర్వచనాతీత, మాయాశూన్య, అభయదాయక సంస్థిత స్వరూపిణి అట్టి అమ్మ రూపము రుద్రాణి రూపమే అనుగాక! అభేదం అని గ్రహించదగును.


కనుక అఖండ సచ్చిదానంద పరదేవతారూప రుద్రాణీ అమ్మవారు ఇట్టి వేదాంత విజ్ఞాన స్వరూపాన్ని విదులు - మంత్రద్రష్టలు స్పష్టంగా అవగాహన చేసుకోగలరు.

**శక్తిపీఠ ప్రదేశం : కాళీఘాట్**

కలకత్తా నగరం (పశ్చిమబెంగాల్)లోని అలీపూర్ అనే ప్రాంతంలో వెలసిన శక్తిపీఠం ఇది టోలీగంజ్‌కు 2 కి.మీ. దూరంలో ఉంది.

రుద్రాణి ఇక్కడ 'ఆదికాళిక'గా అర్చించబడుతున్నది.

కాళీఘాట్‌గా పిలువబడే టోలీనాల్లా వద్ద మనం ఈ రుద్రాణిని దర్శించగలం!



## దేవి పీఠం : కాలంజరం
## దేవి రూపం : కాళి

కాళిగా శక్తిపీఠ సంస్థిత అయిన అమ్మవారి తల వెంట్రుకలు పడిన ప్రదేశం ఇది. గంగానదీ తీరాన వెలసిన ఈ కాలంజర పీఠం అమ్మవారు త్రినయని, రక్తాంబర, ముండమాలిని, ముక్త కేశి అనే నామాంతరాలతో అర్చించబడుతున్నది

ఈ ప్రాంతంలో ఇతర అమ్మవార్లుగా సింహవాహని, సర్వమంగళ, తారాసుందరి, హజార భుజకాళి అలరారుతున్నారు.

వామాచారుల దృష్టిలో కాళికా మాతగా ఉండే అమ్మవారు, సమయాచారుల దృష్టిలో 'లలిత'మైన దేవి.

కపాల మాలలతో అలంకరించబడిన మహాకాళి కాల స్వరూపం. ఇది శక్త్యుపాసకుల భావం. కల్హారమాలలతో అలంకరించబడిన తల్లి కల్యాణకారిణి. ఇది వైదిక తత్పరుల భావన. ఆరాధనలు వేరైనా కొల్చే రూపం మాత్రం ఒకటే!

శక్తిపీఠ ప్రదేశం : కలకత్తా

పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కటా నగరం. అమ్మవారిని కాళీమాత అని సామాన్యంగా వ్యవహరించినా, ఈ శక్తిపీఠం చాలా శక్తివంతమైనది రాష్ట్ర రాజధానిలోనే వెలసిన ఈ శక్తిపీఠం సందర్శించడానికి దేశ విదేశీ యాత్రికులు వస్తుంటారు. రామకృష్ణ పరమహంస ఆరాధించిన కాళీమాత.



దేవీ పీఠం : **సాలగ్రామ**
దేవీ రూపం : **మహాదేవి**

దేవ్యధర్వ శీర్షోపనిషత్ ప్రకారం.... మహాదేవి భయావినాశిని. ప్రకృతి. శివస్వరూపిణి. కారుణ్యమూర్తి. హృదయకమల మధ్యాన ఆ దేవి ప్రకాశిస్తున్నది.

అది నుంచీ దేవీ (శక్తి) పూజ ఉన్నదే! ఈ విశ్వసృష్టి సమస్తంలోనూ ప్రాముఖ్యం వహించే దేవి కనుకనే మహాదేవి అయింది. దీనిని బట్టి వేదరుషులు పరాశక్తిని జగత్ ఉత్పత్తి స్థితిలయ కారిణిగా శక్తిసమాహార స్వరూపిణిగా దర్శించారు.

తైత్తిరీయారణ్యకం, కేనోపనిషత్‌లలో మహాదేవి హైమవతిగా చెప్పబడింది. సంస్కృత ప్రాకృత సాహిత్యాలలో కూడా ఈ దేవి ప్రసక్తి అధికంగా కన్పిస్తుంది.

స్కందపురాణం అవంతీ ఖండం ప్రకారం హరసిద్ధి దేవి. బౌద్ధుల ఆరాధనల ప్రకారం అపరాజితా దేవి కూడా ఈమెయే

శక్తిపీఠ ప్రదేశం.: సలాటి

పశ్చిమబెంగాల్‌లోని సలాటి అనే ప్రాంతమున కొండపై వెలసిన అమ్మవారు. ఇక్కడ సతీదేవి కాలి ఎముక పడినట్లుగా చెపుతారు.

భోల్‌పూర్ నుండి 79 కి.మీ. శాంతినికేతన్ నుండి 105 కి.మీ. బస్సు ద్వారా ఇక్కడికి చేరుకోవచ్చు!

భోర్‌భమ్ జిల్లా కేంద్రం నుండి 3 కి.మీ. రాంపూర్ హాట్ 18 కి.మీ. రైలు ద్వారా కూడా రావచ్చు!



## దేవీ పీఠం : శివలింగ
## దేవీ రూపం : జలప్రియ

పౌరాణిక గాథల ప్రకారం గంగనూ, పార్వతినీ విడదీసి చూస్తారే తప్ప పార్వతికీ గంగకూ తేడా లేదని పండితులు సెలవిస్తూ "సూక్ష్మదృష్టికీ స్థూల దృష్టికీ ఉన్న భేదం ఇలాంటి సందర్భాలలోనే తెలుస్తుంది" అంటారు. కనుకనే శివప్రియ, జలప్రియ రూపాన వెలసిందని చెపుతారు.

సమస్త జగత్ప్రాణాధారమైన జలం, ఆ శివాణి రూపమని భావించడం చేతనే కిరీటేశ్వరిగా శివుని జటాజూటాలను అలరించిందామె. కనుకనే ప్రకృతి స్వరూపమైనది జలం. ఇది దేవివలెనే సర్వశక్తివంతమైనది.

ఆకాశంలా, భూమిలా సర్వవ్యాపకమై సృష్టి (జలచరాలకు) స్థితి (అందరికీ) లయ (ప్రకృతి బీభత్సాలైన తుపాన్లు మొ॥) కారకమై సాక్షాత్ శివాత్మికయైనది.

శక్తిపీఠ ప్రదేశం : దహసార

భగీరథీ నదీ తీరంలో మోర్షిదాబాద్ రెండో వైపున దహసార గ్రామం కిరీటి కోనలో వెలసిన అమ్మవారు. కిరీటేశ్వరిగా పూజలందుకుంటున్న ఈ శివలింగ పీఠం పశ్చిమబెంగాల్‌లో ఉన్నది.

గంగాసాగర లేక సాగర్ మేళా అని పిలువబడే ఆదినాథ క్షేత్రం దర్శించిన వారు, గంగాదేవి రూపంలో (జలప్రియ) వెలసిన అమ్మవారిని దర్శించడానికి ఇక్కడకు వస్తారు.



## దేవీ పీఠం : మహాలింగ పీఠం
## దేవీ రూపం : కపిలా

స్థలపురాణాల్లో కొన్ని కాల్పనిక గాధలు చోటు చేసుకున్నప్పటికీ, మహాలింగ పీఠం కాళేశ్వరం క్షేత్ర మహత్యం అధికంగా గలది. ఇక్కడి స్వామివారికి ఇడ పింగళ అనే రెండు నాశికారంధ్రాలున్నాయి. అభిషేకం పేరిట మనం పోసే జలం ఈ నాశికా రంధ్రాల ద్వారా అంతర్వాహినిగా (సరస్వతీ నదిగా) భూమార్గాన ప్రవహించి గోదావరి ప్రాణహితల సంగమం వద్ద కలుస్తుందట!

గోదావరి నది అర్ధచంద్రాకారంగా వంపు తిరిగి ప్రవహించడం వల్ల ఏర్పడిన చంద్రవంక ఉన్న ప్రదేశంలో కాళేశ్వర దేవాలయం వెలసింది. పుణ్యక్షేత్రాలకు ఇలాంటి వంక ఉన్న ప్రదేశం ఎంతో శుభప్రదం అంటారు.

కాళేశ్వర నివాసోవా కాళేశ్వర నిరీక్షణం
కాళేశ్వరస్య స్మరణం సర్వపాప ప్రనాశనం ॥

**శక్తిపీఠ ప్రదేశం : కాళేశ్వరం**

ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లాలో మహదేవపురం నుండి 15 కి.మీ. దూరంలో ఉన్నది. కాళేశ్వర క్షేత్రం. ఒకే పానవట్టంపై రెండు లింగాలు కలిగి ఉండడం ఇక్కడ ప్రత్యేకత.

ఈ మహాలింగ పీఠం సందర్శించడం, కాశీ కంటె పరిముల్లు వాసి ఎక్కువట! (కాశీ క్షేత్రం త్రివేణీ సంగమం మాత్రమే! కాగా ఈ క్షేత్రం పంచనదీ సంగమం కనుక.) అట్లే.... కాశీలో మరణిస్తే మోక్షం. కానీ.... ఈ క్షేత్ర సందర్శనమే మోక్షదాయకమట!

## దేవీ పీఠం : మార్కోట
## దేవీ రూపం : ముకుటేశ్వరి

సతీదేవి కుడిపాదం పడిన స్థలంగా చెబుతారు.



యోగులు, మహర్షులు సందర్శించగలిగిన మహామహిమాన్విత ముకుటేశ్వరి. పాపకూటము (రాశులు)లను నశింపజేయునది. "అహం త్వా సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామి" అనే శ్రుతం ప్రకారం ఆమె సర్వపాపహారిణి.

శక్తిపీఠ ప్రదేశం : మానససరోవరం

టిబెట్‌లో చేరివున్న మానససరోవరం, శక్తిపీఠ సందర్శకులకు గొప్ప ఆధ్యాత్మిక లక్ష్యం కానీ - ఈ యాత్ర దుర్లభం. ఆల్మోరా (ఉత్తరప్రదేశ్) నుండి 300 కి.మీ. యాత్రలో ఎన్నో అవాంతరాల్ని అధిగమిస్తూ, ఈ యాత్ర చేయాల్సి ఉంటుంది. హంసలు విహరించే కైలాస సరోవరం (గిరి) ఇక్కడికి 50 కి.మీ. దూరంలో ఉంటుంది.



## దేవీ పీఠం : మాయాపురి
## దేవీ రూపం : కుమారి

దక్షప్రజాపతి యజ్ఞం చేసిన ప్రదేశం ఇదేనని చెపుతారు. దక్షుని కుమార్తె సతీదేవి చితాగ్నిని రగిలింపజేసుకుని, తనువును అగ్ని దగ్ధం చేసుకున్న ఈ ప్రదేశం.... కుమారీ పీఠం.

దేవి కకారరూపం. కల్యాణి. కుమారి. కమనీయ. కళావతి. కకారరూపం (ఏకార్థ నిఘంటువు ప్రకారం) విద్యా విగ్రహః ఉదకం అని కూడా అర్థం.

యోగశాస్త్రం ప్రకారం.... కకారం శిరోస్థానం సర్వప్రాణులకు శిరస్సునందు అమృతం ఉన్నది. యోగమార్గంలో ఈ కుండలినీ శక్తిని జాగృతం చేసి, ఆ అమృత ప్రవాహంలో యోగులు దేవీసామ్యం పొందగోరుతారు. యోగాగ్నిని జ్వలింపజేయగలది కుండలినీ శక్తి.

శక్తిపీఠ ప్రదేశం : హరిద్వార్

ఉత్తరప్రదేశ్‌లోని కుమారీదేవి శక్తిపీఠం, హరిద్వారంలో ఉన్నది. దీనికే మాయాపురి అని మరో పేరు. హృషీకేశం నుండి ఇది 24 కి.మీ. దూరంలో ఉన్నది.

సతీదేవి అగ్నికి ఆహుతి అయిన స్థలం (సతీగుండం). ఇక్కడ గంగానదీ తీరంలో మనం దర్శించగలం! డెహరాడూన్ నుండి ఇక్కడకు 64 కి.మీ. దూరం.

దేవీ పీఠం : సంతాన
దేవీ రూపం : లలితాంబిక

అమ్మవారి హస్తాంగుళీయకం పడినట్టి ప్రదేశంగా దీన్ని పేర్కొంటున్నారు.

'లలితం త్రిషు సుందరమ్' అను వచనం అనుసరించి లలితం అంటే సుందరమైనదని అర్థం. లలితాంబిక అనుపమ సౌందర్యవతి. లక్ష్మీవాణీ సేవిత. లలనారూప. ఇక్కడ లలన అనగా స్త్రీ, రూపశబ్దం ఐశ్వర్యాత్మకంగా వాడబడితే లలనారూప అనగా సంపద్దాయకమైనది అని కూడా చెప్పవచ్చు!

లలితా త్రిశతిలో "లాకినీ లలనా రూపా లసద్దా డిమ పాటలా" అనే నామాలను బట్టి శుభలక్షణ దివ్యాంగన అయిన లలిత, జగత్తున తన సంతానం అంతటికీ (విశ్వకుటుంబిని గనుక) సౌఖ్యభాగ్యాలు ప్రసాదిస్తున్నదని భావము.

శక్తిపీఠ ప్రదేశం : ప్రయాగ

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ జిల్లాలో త్రివేణీ సంగమమున వెలసిన శక్తిపీఠం. ఇక్కడి అక్షయ వటవృక్షం క్రింద లలితాంబగా పూజలందుకుంటున్నదీ అమ్మవారు.

అలహాబాద్‌కు ఇది 3 కి.మీ.

ప్రయాగ క్షేత్రంలోనే 14 వివిధ పేర్లతో వ్యవహరించబడే ప్రయాగలున్నాయి. గుప్త ప్రయాగ, హరిప్రయాగ, భాస్కర ప్రయాగ.... ఇలా అన్నమాట! సోమప్రయాగ వద్ద మనం లలితాంబను దర్శించవచ్చు!

## దేవీ పీఠం : గయాక్షేత్ర
## దేవీ రూపం : మంగళ

యః శివో నామ రూపాభ్యాం
యా దేవీ సర్వమంగళా
తయో స్సం స్మరణాత్పుంసాం
సర్వతో జయ మంగళం ॥

మాతంగి, మంగళ.... అనే శబ్దాలు సామాన్యమైన అర్థంలో శివసతిని తెలిపేలా ఉన్నా, విశేషార్థంలో దశమహా విద్యలలో ఒకటైన ఆరాధన (తంత్ర సంబంధి) యందు విజయాన్ని కలిగించేది అని భావిస్తారు.


మంగళగౌరీ వ్రతాలు మహిళలు ఆచరిస్తుంటారు. పెళ్లిలో మంగళ గౌరీ పూజ చేయించి సుమంగళిగా స్త్రీని దీవించడంలోనూ మంగళం (శుభం) ఆశించడం మన సాంప్రదాయం.

మంగళప్రదుడైన శివునిచేరి, పార్వతి 'సర్వమంగళ' అయినది.

**శక్తిపీఠ ప్రదేశం : గయ**

ఈ శక్తిపీఠ క్షేత్రంలో వెలసిన అమ్మవారు సర్వమంగళ. బీహార్ రాష్ట్రంలోని పాట్నా నుండి 73 కి.మీ. ఔరంగాబాద్ నుండి బస్సు; ధనబాద్ నుండి రైలు సౌకర్యం ఉంది.

ఇది ఫల్గుణీనదీ తీరాన వెలసిన శక్తిపీఠం. ప్రస్తుతం ఈ నది అంతర్వాహిని. మధుర, శ్వేత నదుల సంగమ స్థలం. పాత గయ నుండి కొత్త గయకు 1 కి.మీ. దూరం. శ్రాద్ధకర్మలకు ప్రసిద్ధి.



## దేవీ పీఠం : పురుషోత్తమ
## దేవీ రూపం : విమలా

సతీదేవి ఊరువు భాగం ఇక్కడ పడినట్లుగా చెపుతారు. ఇక్కడ అమ్మవారు విమలాదేవి అనే పేరిట పూజలందుకుంటున్నది.

ఎక్కడా లేని విధంగా భారతదేశంలో దుర్గామాధవులు జంటగా పూజలందు కుంటున్నారు. ఇక్కడ జగన్నాధాలయంలో బలభద్రుడు, సుభద్ర, జగన్నాధ స్వామి వార్ల విగ్రహాలుండే ఆలయాలున్నాయి.

శబర జాతిలో ఒక తెగవారైన నిషాదులకి 'గాలుడు' అనేవాడు ప్రభువు. ఇతడే దుర్గాదేవిని జగన్నాధాలయంలో ప్రతిష్ఠించాడని ఒక ఐతిహ్యం.

శివస్వామి వెలసిన చోట అమ్మవారు ఉండడం ఎంత సహజమో, పార్వతికీ లక్ష్మికీ తేడా లేదని నిరూపించేలా విష్ణ్వాలయంలో దుర్గ ఉండడం అంతే సహజం.

శక్తిపీఠ ప్రదేశం : పూరీ

విమలగా అమ్మవారు శక్తిపీఠాన వెలసిన పుణ్యక్షేత్రం ప్రస్తుతం పూరీ జగన్నాధంగా వ్యవహరించబడుతున్నది. ఒరిస్సా రాష్ట్రంలో బంగాళాఖాతం సముద్ర తీరాన, రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుండి 64 కి.మీ.

ఇక్కడ కపాల మోక్షలింగం, లోకనాధ శివమూర్తి, మకరధ్వజ హనుమాన్, బేడీ హనుమాన్‌ల ఆలయాలు కూడా దర్శించవచ్చు!



## దేవీ పీఠం : సాహస్రి
## దేవీ రూపం : ఉత్పలాక్షి

దేవి నేత్రాలు, ఐహికా ముష్మిక సంపదలకు హేతుభూతములగు (ఉత్+పల+అక్షి) అనే అర్థంలో ఇక్కడ వాడబడుటచే దేవి ఉత్పలాక్షి. అంటే.... సాధకుడు అమ్మవారి పరిపూర్ణ కటాక్షానికి పాత్రుడైతే, కేవలం ఆమె వీక్షణ మాత్రం చేతనే అట్టి భక్తునికి పరిపూర్ణంగా మహదైశ్వర్యం సిద్ధించగలదు.

కనుకనే దేవి లబ్ధ భక్తి సులభ. భక్తి 2 విధాలు. సామాన్యం. విశేషం అని.... ఆర్తులు, జిజ్ఞాసులు, ధర్మార్థ కాములు ఆయా ఫలితాల కోసం ప్రార్థిస్తే వారి భక్తి తత్పరతను బట్టి ఉత్పలాక్షి కరుణను పొందగలరు.

'ఏక భక్తి ర్వి శిష్యతే' అని భగవద్గీత. ఇదే ఆత్మైక సంలీన భక్తి. ఇదే విశిష్టమైనది. కటాక్షార్హమైనది.

శక్తిపీఠ ప్రదేశం : కలకత్తా

పశ్చిమబెంగాల్‌లోని కలకత్తా దగ్గర్లో భోల్పూర్ వద్ద (సమీప రైల్వేస్టేషన్ ఫ్రాంటిక్) వెలసిన కంకాళి మాత ఈ శక్తిపీఠ సంస్థిత.

చాలా ఉగ్రరూపం కలిగిన ఈ అమ్మవారు నీట మునిగి ఉంటుంది. జలధార ప్రక్కన గుడి కట్టబడినది.

అమ్మవారి తుంటి భాగం ఇక్కడ పడినట్లుగా ప్రతీతి. (అసలు కలకత్తాలోని అధిక భాగము కాళీ ఆలయాలు శక్తిపీఠాలే అంటారు.)

## దేవీ పీఠం : హిరణ్యాక్ష
## దేవీ రూపం : మహోత్పల

సతీదేవి ఎడమకాలి చీలమండల పడిన ప్రదేశంగా ఈ శక్తిపీఠం వ్యవహృత మవుతున్నది. అమ్మవారు ఇచ్చట 'కాపాలిని' అనే తాంత్రికదేవతగా పూజించబడుతోంది.

హ్రీం శబ్దం అనే ఖడ్గధార ధరించిన దేవిని, విరోధుల వల్ల కలిగే దుఃఖోపశమనార్థం పూజించే తాంత్రికుల దృష్టిలో అంబ 'మహోత్పల'.

ఈ హ్రీం కార శబ్దం చేత, తత్కార్యభూతాలయిన వేదాలు చెప్పబడుతున్నాయి. దేవి వేదాలకు పూర్వమే ఉన్నది. శబ్దరూపిణి. ఈ శబ్దాన్ని విపులీకరించే అర్థాలే వేదాలు అనగా శబ్దము కంటే అర్థమే ముందుగా ఉన్నదని భావం. (ఇంకొక రీతిలో చెప్పాలంటే 'క్రియ' మొదట మంత్రం తరువాత) మహోత్పల అనాది. అర్చనాది భక్తి ప్రపత్తులు ఆ తరువాత ఏర్పడ్డవి.

శక్తిపీఠ ప్రదేశం : థమలుక్

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని మిద్నపూర్ జిల్లాలో థమలుక్ గ్రామంలో వెలసింది ఈ శక్తిపీఠం. ఇది మాయాపూర్‌కు 15 కి.మీ. సరిహద్దున గల ఒరిస్సాలోని ఖర్గపూర్ నుండి 80 కి.మీ.

పంచకుర్ రైల్వేస్టేషన్ నుంచి బస్సులోనూ ఇక్కడకి చేరుకోవచ్చు!

శివునిపై చతుర్భుజాలలోనూ ఆయుధాలు ధరించి ఉగ్రరూపాన నిలిచిన అమ్మవారు.



## దేవీ పీఠం : విపాశా
## దేవీ రూపం : అమోఘాక్షి

పార్వతీదేవి అంశతో వెలసిన మహాలక్ష్మి శక్తిపీఠం. సతీదేవి యొక్క నేత్రత్రయంలోని ఒక కన్ను ఇక్కడ పడినట్లుగా చెపుతారు.

అరచేతిలో శివలింగాన్ని ధరించిన ఈ మహాలక్ష్మి ప్రశాంతవదన సదా ఈశ్వర ధ్యానంలో ఉంటుంది ఇది శ్రీశాంత దుర్గ ఆలయానికి దగ్గరల్లో ఉంది. ఈమె కొప్పులోని చెంగల్వదండలు సర్వకాల సర్వావస్థల్లోనూ నవనవోన్మేషం

వేదవ్యాసుడు అమోఘాక్షిని అద్భుత వచో సంపద కోసం కొలిచాడు

ఈ దేవి దివ్యచరణ కమలాలకే పాదుకా యుగళమనీ సాక్షాత్తు శివుడినే నేత్రాలుగా కలిగినందున అమోఘాక్షి అనీ భాస్కరరాయ వ్యాఖ్యానం.

శక్తిపీఠ ప్రదేశం : బందోడ్ (గోవా)

కొంకణతీరాన, బొంబయికి 320 కి మీ. దూరంలో ఉన్న అతిచిన్న రాష్ట్రం. పోర్చుగీసు వారి ప్రాబల్యమే అధికంగా ఉన్న ప్రాంతం

కదంబుల కాలానికి చెందిన అనేక దేవతామూర్తులను పోర్చుగీసు వారు నేలమట్టం చేశారు

పొండా నుండి 4 కి.మీ. దూరంలోని బందోడ్‌లో ఉన్న మహాశక్తి పీఠం ఇది

ఇది గోవా (రాజధాని) నుండి 31 కి మీ దూరంలో ఉంది.

## దేవీ పీఠం : పుండ్రవర్ధన
## దేవీ రూపం : పాటలా

వజ్రేశ్వరిగా ఆరాధించబడే (కాంగ్డా అమ్మవారు) శక్తిపీఠం 'పాటల' దేవీరూపంగా భావిస్తున్నారు



ఇక్కడి దేవి ముఖంలో రజోగుణం అధికమై పాటల పుష్పం వలె ప్రకాశిస్తున్నందున సార్థక నామధేయ అయిందంటారు. ఈ ప్రాంతంలో దూషణుడు అనే రాక్షసుడు బ్రాహ్మణులను వేధించుచుండగా, ఒక్క నిశ్వాసంతో పాటల, అతడ్ని సంహరించిందట!

శక్తిపీఠ ప్రదేశం : కాంగ్డా

హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని కాంగ్డా జిల్లా కేంద్రం.

ఇక్కడకు పఠాన్‌కోట్ నుంచి జోగిందర్ నగర్ వరకు రైల్వేలైన్ ఉంది. ఇక్కడ నుండి రోప్‌వే ద్వారా లోయలోకి చేరవచ్చు! బస్సు ప్రయాణ సౌకర్యం కూడా ఉన్నది. చలి అధికం.

ఇక్కడ ఎక్కువ భాగం గుహాలయాలున్నాయి. ప్రకృతి సౌందర్యం అద్భుతం.



దేవీ పీఠం : **సుపార్శ్వ**
దేవీ రూపం : **నారాయణి**

త్రిపురుడు అనగా బ్రహ్మ విష్ణు రుద్ర శరీరాలను కలిగినవాడు. బ్రహ్మము, పరమేశ్వరుడు, హరి ఈ మూడు రూపాల ఏకరూపతయే దేవీ త్రిపురసుందరి. ఇందులో ఒక అంశ నారాయణి. నాదరూప శక్తి యందు ఒక కోణం.

'నారాయణీ' నాదరూపా నామరూప వివర్జితా' అని నామస్మరణం. జయిని. జనయిత్రి. అరుణగా ఆరాధించబడేదీ నారాయణి రూపమే! శ్రీపీఠ సంవర్ధిని దోలాసుర మర్దినీ కూడా.

నారాయణీ దేవి ఒక్కొక్క నరుని శరీరంలో ఒక్కో స్థానంలో ఉంటుంది. మార్కండేయ పురాణం ప్రకారం నారాయణి మాత నెత్తిపై మాత్రమే తప్ప ఇంకెక్కడ ఉన్నా శుభాలనే ఇస్తుందట!

సమస్యే సర్వలోకానాం జననీం అబ్జ సంభవాం ।

త్రియం ఉన్నిద పద్మాక్షీం - విష్ణ వక్షస్థల స్థితాం ॥ అని ఇంద్రుని చేత ప్రస్తుతింపబడింది నారాయణి.

శక్తిపీఠ ప్రదేశం : బాన్‌పూర్

ఒరిస్సా రాష్ట్రంలోని బాలూగామ్‌కు 12 కి.మీ. దూరంలో; బార్‌కుల్‌కు 20 కి.మీ. దూరంలో చిలకసరస్సు వద్ద వెలసిన శక్తిపీఠం. ఇది సముద్రంలోని ఒక పాయ. విస్తృతంగా సరస్సు వలె చీలి నందువల్ల దీవివలె కన్పిస్తుంది. భవతి నారాయణి అమ్మవారుగా భక్తులను అలరిస్తున్న అమ్మవారు.



## దేవీ పీఠం : త్రికూట
## దేవీ రూపం : రుద్రసుందరి

రుద్రదేవుని ప్రియపత్ని అగుటచేత - ఉమయే రుద్రసుందరి. 'లలితా తాపనీయం' ప్రకారం 'అనేక మన్మధాకార కామేశోత్సంగ వాసిని' అనగా...: మన్మధాకారుడైన రుద్రునికి వామాంకమున వసించునదని అర్థం.

అర్థనారీశ్వర తత్త్వము దీనియందు ప్రతిపాదిత మగుచున్నది.

రుద్రునకు పరమానందకరమైనట్టి స్వరూపమేదైతే ఉన్నదో; రుద్రునికి ఏ రూపమందు ప్రీతి కలదో దానికి విషయభూత అగుటచేత రుద్రసుందరి కామేశ్వర ప్రణయిని అయినది.

ఈ అమ్మవారు లబ్ధ యవ్వన శాలిని. పరిణామ నాశములనే రెండు అవస్థలకూ అతీతమయినది.

'అజరో మృతోభయోబ్రహ్మం' అనే బృహదార కోపనిషత్ శ్రుతి ప్రమాణాన్ననుసరించి ఆదిశక్తి రుద్రాణి ఏకప్రకార సౌందర్య విలసిత అయి ఉన్నది.

శక్తిపీఠ ప్రదేశం : కోటప్పకొండ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలోని నర్సరావుపేటకు సమీపంలో (10 కి.మీ.) త్రికూటాద్రి పైన తాండవేశ్వరస్వామి - రుద్ర సుందరి అమ్మవారు వెలసిన దివ్యక్షేత్రం. కల్యాణోత్సవాలు లేని స్వామివారు దీనికి కారణం.... సతీ వియోగ బాధలో శివుడే ఉండటమే నంటారు. స్వామివారిని త్రికూటేశ్వరుడు అని కూడ పిలుస్తారు. ఓగేరు నదీతీరం వద్ద గల శక్తిపీఠం.



దేవీ పీఠం : **విపుల**
దేవీ రూపం : **విపులేశ్వరి**

'విపులా చ పృథ్వీః' అని నానుడి. సర్వ ప్రపంచం పృథ్వి అనబడుతున్నది. కనుకనే సంసారమనే (ప్రపంచం అనే) ప్రక్రియ ద్వారా ఇది విస్తరించబడుథున్నది.

ఇట్టి సంసారం ఏర్పడ్డానికి స్థూల సూక్ష్మ అర్థాలు రెండిటా ఆదిశక్తి (స్త్రీ శక్తి స్వరూపిణి) కారణభూతురాలవుతున్నది.

"ఏకం బీజం బహుధా యః కరోతి" (శ్వేతా శ్వరోపనిషత్) అనగా ఏకమగు బీజమును అనేకంగా చేసే దానిని ఎవరైతే కనుగొంటున్నారో ఏ భక్తులైతే తెల్సుకొంటున్నారో.... అట్టివారి చేత ప్రవచింపబడుచున్న విపులేశ్వరి.

ఈ ప్రపంచాభివ్యక్తికి, ఈమె నిమిత్త కారణమగుట చేత ఈమెయందు కర్తృత్వం సమంజసమై ఒప్పుచున్నది. కనుకనే విశ్వార్థ జనయిత్రి అయినది.

శక్తిపీఠ ప్రదేశం : హట్టహాస

పశ్చిమబెంగాల్ (జిల్లా భీర్‌భమ్)లోని లాభపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో అహ్మద్‌పూర్‌కు 12 కి.మీ. దూరంలో (ఖట్వాలైన్)లో ఉన్నదీ శక్తిపీఠ క్షేత్రం.

ఇక్కడ అమ్మవారి అధరం పడినట్లుగా చెపుతారు. అమ్మవారిని 'పుల్లార' మాత అని కూడ అంటారు. ఉద్ధారణ్‌పూర్ నుండి బస్సు సౌకర్యం ఉంది. ఇక్కడకు శాంతినికేతన్ 40 కి.మీ.

## దేవీ పీఠం : మలయాచలం
## దేవీ రూపం : కల్యాణి

కల్యాణములు అంటే సుఖాలు. ఇవి లౌకికం  పారలౌకికం అని రెండు విధాలు. తురీయ (బ్రహ్మా)నందం మొదలు తుచ్ఛ కామ సంబంధమైన ఆనందం వరకు.... అనగా అత్యుత్తమ స్థాయి ఆనందం మొదలు అత్యల్ప స్థాయి ఆనందం వరకు ఈ సుఖాలు అందించగలవు.

అంబ కల్యాణ గుణశాలిని. కల్యాణ శైల నిలయ అని లలితాత్రిశతి చెప్తున్నది. శైలం అంటే  శిలా ఘనం. వ్యుత్పత్త్యర్థాన్ని తీసుకుంటే ఘనీభవించిన సుఖం. అట్టి కల్యాణ శైలమునందు ఆనంద ఘనమగు స్వస్వరూపమున నిలబడి ఉన్నది కనుక, దేవి 'కల్యాణి' అని సుఖ సౌఖ్యాలను కలిగించునదని వివరించబడినది.

'ఏతస్యైవానంద స్యా న్యాని భూతాని మాత్రాముప జీవంతి'... అని బృహదారణ్యకోపనిషత్.

శక్తిపీఠ ప్రదేశం : జాజ్‌పూర్

సింహాన్ని వాహనంగా కల్గి, ఒక చేత్తో కత్తి మరో చేత్తో మహిషాసురుని తోక పుచ్చుకుని ఉన్న అమ్మవారుగా 'బిరజా' దేవిగా (కల్యాణికి నామాంతరం) వెలసిన శక్తిపీఠం

భువనేశ్వర్  కలకత్తా లైనులో కటక్ నుండి 3 గంటలు బస్సులో ప్రయాణించి ఇక్కడకు చేరుకోవచ్చు! ప్రాంతీయాచారం ప్రకారం రథయాత్ర గలదు.



## దేవీ పీఠం : సహ్యాద్రి
## దేవీ రూపం : ఏకవీర

సతీదేవి 'కుడిస్తనం' పడిన చోటుగా భావిస్తారు. 'ర్మాయుర్యే ఏకవీరికా' అని అష్టాదశ శక్తిపీఠ స్తోత్రంలో నుతించబడిన ఈ అమ్మవారికి, కళ్లు, ముక్కు, నోరు తీరుగా ఉండకపోవడం గమనార్హమే! శ్రీ క్షేత్రముగా పిలువబడే ఈ క్షేత్రాన్ని జమదగ్ని మహర్షి భార్య పరశురాముని తల్లి అయిన రేణుక పేరిట రేణుకా క్షేత్రం అనీ అంటారు

"స్త్రీ రూపాంచింతయేత్ దేవీం పుంరూపా మభవేశ్వరీం ।
అథవా నిష్కలాం ధ్యాయేత్ సచ్చిదానంద విగ్రహాం ॥" అని చిద్రూపిణి, ఏకవీర అయిన దేవిని నిష్కల (శరీరావయవ రహితం అయినదిగా) ధ్యానించవచ్చు!

సమస్త ఏకపంచాశత పీఠాలలో (501) ఏకవీర పీఠం ఒకటిగా ప్రపంచసార సంగ్రహంలో ఉంది. ప్రస్తుతం అలభ్యం!

**శక్తిపీఠ ప్రదేశం : మాహోర్**

మహారాష్ట్రలోని మాహోర్ గ్రామంలో రేణుక లేక ఏకవీర మాతగా వెలసిన శక్తిపీఠం. నాందేడ్ జిల్లా కేంద్రం నుండి ఇక్కడకు 128 కి.మీ.

కేవలం అమ్మవారి తల మాత్రమే, ఇక్కడ విగ్రహంగా దర్శనం ఇస్తుంది. (మెడగాని, భుజాలుగాని లేని శిరోభాగం) భీకర రూపంతో క్షుద్రపూజలతో బలుల దేవతగా కొలువబడుతోంది. సహ్యాద్రి పర్వత శ్రేణులలో ఒక శిఖరంపై ఈ పీఠం గలదు.

దేవీ పీఠం : హరిశ్చంద్ర
దేవీ రూపం : చంద్రిక

ఇది సతీదేవి కుడికాలు పడినచోటు. ఈమె పాదారవిందాలే అనంతకోటి చంద్రకిరణ కాంతులను వెదజల్లుతూ వుంటాయి, సౌందర్యలహరి ప్రకారం దేవి చరణాలే కిరణజన్యాలు.



శక్తిపీఠ ప్రదేశం : త్రిపురలోని ఉదయపూర్

ఉత్తర ఈశాన్య రాష్ట్రాలలో ఒకటైన త్రిపురలో వెలసిన శక్తిపీఠం. అమ్మవారు ఇక్కడ త్రిపుర సుందరీ దేవిగా (ప్రాంతాన్ని బట్టి) ఆరాధించబడుతున్నప్పటికీ, చంద్రికా మాతగా కొలువై వున్నది. కాళిగా మరికొందరు పూజిస్తారు.

రాజధాని అగర్తల నుండి ఈ ఉదయపూర్ శక్తిపీఠ క్షేత్రానికి 56 కి.మీ.

దేవీ పీఠం : **రామతీర్థ**
దేవీ రూపం : **రమణా**



రమింపచేయునది అనే అర్థంలో రమణీయార్థ ప్రతిపాదిత శబ్దరూపిణిగా మాత ప్రకాశిస్తున్నది. ఇక్కడ రమించడం అనేది వేదాంతపరమైన అర్థంగా గ్రహించాలి.

కామబాణాలను బోలు చూపులు చిత్తమును క్షోభింప చేయుట సహజం కాగా, రమణి వీక్షణాలు ఇక్కడ శంకరునికి 'భ్రాంతి గొల్పు' లేదా 'స్పందనం కలిగించు' అనే భావములో వాడబడినవి. అట్టి రమణిని ఈశ్వరుడే అర్చించాడు

**శక్తిపీఠ ప్రదేశం : సీతాకుండ్ (బంగ్లాదేశ్)**

పశ్చిమబెంగాల్ సరిహద్దుకు కొద్దిగా దగ్గరగాను - ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోను చేరి ఉన్న సీతాకుండ్‌లో వెలసిన శక్తిపీఠం. అమ్మవారు 'భవానీ మాత'.

చంద్రశేఖర పర్వతంపై వెలసిన ఈ పీఠం చటగాంవ్ జిల్లాలో ఉంది. ఒకప్పుడు అఖండ భరత భూమిలో భాగమైనా, ప్రస్తుతం మన పరిధిలో లేదు.

దేవీ పీఠం : యమునా తీర్థ
దేవీ రూపం : మృగావతి



సింహమే సింహాసనంగా కలిగిన సింహాసనేశ్వరి మృగావతీ దేవీ రూపం. సింహ శబ్దం హింసను సూచించగా దాని నధిష్టించు మృగావతి, హింసను అణచిపెట్టి దానిపై స్వారీ చేయడం ద్వారా హింసాంతకిగా నీరాజనాలందుకుంటున్నది. అనగా మృగావతి శాంతమూర్తి అని భావం.

శక్తిపీఠ ప్రదేశం : అల్మోరా

ఇక్కడి కషాయీ పర్వతంపై కౌశికీ దేవిగా పూజలందుకుంటున్న మృగావతి వెలసిన శక్తిపీఠం ఇది. (కేసరీదేవి అనీ అంటారు.) ఉత్తరప్రదేశ్‌లోని ఈ అల్మోరా పట్టణం నైనిటాల్‌కు 100 కి.మీ. మానససరోవర యాత్రకు వెళ్లేవారు ఇక్కడి నుండి సులువైన మార్గంగా ఎంచుకుంటున్నారు. ఈ శక్తిపీఠ క్షేత్రం నుండి కైలాసగిరి 225 కి.మీ. అల్మోరా నుంచి కషాయీ పర్వతం 13 కి.మీ.



## దేవీ పీఠం : వికోట తీర్థ
## దేవీ రూపం : కోటి

సతీదేవి అరచేయి ఇక్కడ పడిందని చెపుతారు. కోటీశ్వరి నామధేయంతో అలరారే ఈ దేవీ రూపం ప్రస్తుతం దర్శనీయంగా లేదు. దండయాత్రలలో కోట శిథిలంకాగా, కనుమరుగైంది.

శక్తిపీఠ ప్రదేశం : ఈశ్వరీపూర్

బంగ్లాదేశ్ పరిధిలో చేరిన ఈశ్వరీపూర్, ఖోల్న జిల్లాలో ఉన్నది. ఒకప్పుడు (1972 నాటికి ముందు) బంగ్లాదేశ్ శరణార్థులు పశ్చిమ బెంగాల్‌లోకి ఈ ప్రాంతం నుంచే అధికంగా దేశంలోకి వచ్చేశారు.



## దేవీ పీఠం : మాధవ వన
## దేవీ రూపం : సుగంధా

ఇక్కడ ముగ్గురు అమ్మవార్లు పిండిరాయిపైన త్రికూట పర్వత గుహాలయంలో వెలసి వున్నారు.

కురుక్షేత్ర సంగ్రామానికి ముందు శ్రీకృష్ణుని సలహా మేరకు, విజయం ప్రాప్తించాలని అర్జునుడు ప్రార్థించిన ప్రదేశం

శక్తిపీఠ ప్రదేశం : కాట్రా

జమ్ము & కాశ్మీర్ రాష్ట్రంలో కాట్రా అనే ప్రదేశంలో వెలసిన శక్తి పీఠం. ఇది జమ్ముకు 56 కి.మీ. కాట్రా జిల్లా కేంద్రం కూడా!

శక్తిపీఠ ప్రాంతం కాట్రా నుండి 14 కి మీ. దూరంలో ఉంది. ఇక్కడ ఇంకా రఘునాథ్‌జీ, భూమికా మాత మందిరాలు కూడా దర్శనీయం!

## దేవీ పీఠం : గోదావరి తీర్థ
## దేవీ రూపం : త్రిసంధి

సతీదేవి ఎడమ చెక్కిలి పడిన ప్రదేశంగా చెబుతారు.



శ్లో ॥ అరుణాం కరుణా తరంగి తాక్షీం

ధృత పాశాంకుశ పుష్ప బాణ చాపాం

అణి మాదిభిరావృతం మయూఖైః

అహమిత్యేవ విభావయే భవానీం ॥

శక్తిపీఠ ప్రదేశం : ద్రాక్షారామం

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడకు 32 కి.మీ. దూరంలో ఉన్నది. ఇక్కడి గోదావరి నదికి సప్తతీర్థ అని మరో పేరున్నది. రాజమండ్రి నుంచి 60 కి.మీ.

అమ్మవారు మాణిక్యాంబ. వేశ్యల కులదేవతగా ఆరాధించబడుతోంది. ఆలయం దక్షప్రతిష్ఠగా చెబుతారు.

దేవీ పీఠం : **గంగాద్వార**
దేవీ రూపం : **రతిప్రియా**

అమ్మవారి స్తనాగ్రం పడిన ప్రదేశంగా చెబుతారు.



శక్తిపీఠ ప్రదేశం : హరిద్వారం

ఉత్తరప్రదేశ్‌లోని గంగాతీరం వెంట ఉన్నవారి ద్వారంలో నీల పర్వతంపైన వెలసిన అమ్మవారు చండిగా రతిప్రియగా పూజించబడుతోంది. ఇది 24 కి మీ దూరంలో రుషీకేశ్‌కు ఉత్తరంగా ఉంది

రాతిలో విష్ణుపాదం ఉన్న స్నానఘట్టాన్ని ఇక్కడనే చూడగలం!

గంగానది హిమాలయాల నుండి క్రిందకు దిగిన చోటు కావడంతో దీనిని హరి (గంగా) ద్వారం అన్నారు. శివాలిక్ పర్వత శ్రేణి ప్రారంభమైన ప్రదేశం కూడ ఇదే! అమ్మవారిని ఊరేగించే పద్ధతి గలదు

ప్రకృతి శోభతో అలరారే శివాలిక్ కనుమలలో మూడు కొండలపైన ముగ్గురు అమ్మవార్లు (నీల, విల్వ, దక్షిణ పర్వతాలపై చండి, మానస, పార్వతి) వెలసి ఈ ప్రాంతాన్ని 'శక్తి త్రికోణం'గా రూపింప చేస్తున్నారు




**దేవీ పీఠం : శివకుండ**
**దేవీ రూపం : సుభానందా**

సతీదేవి అమ్మవారి కుడి భుజం పడిన ప్రదేశంగా చెబుతారు. అమ్మవారిని సుభానంద గానే కాక, జ్ఞానాంబ జ్ఞానానంద అని కూడా అంటారు.

శక్తిపీఠ ప్రదేశం : శ్రీకాళహస్తి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో తిరుపతి పుణ్యక్షేత్రానికి చేరువలో ఉన్నది. తిరుపతి నుండి 40 కి.మీ

దక్షిణ కాశిగా వాసిగన్న. ఈ పుణ్యక్షేత్రంలో ఎవరినైనా మరణించేముందు, ఇక్కడ శయనింపచేస్తే అట్టివారి ఆత్మ శివైక్యం చెందుతుందనే నమ్మకం ఉన్నది.



**దేవీ పీఠం : దేవికాతట**
**దేవీ రూపం : నందినీ**

అమ్మవారి దక్షిణపిరుదు పడిన ప్రదేశం. అమ్మవారిని నందినిగా - దెహరీమాతగా కొలుస్తారు. విగ్రహం చాలా చిన్నది.

శక్తిపీఠ ప్రదేశం : దెహిరి

బీహారు రాష్ట్రంలోని హౌరా గయ రైల్వేలైన్‌లో అన్‌సోనే రైల్వేస్టేషన్‌కు చేరువలో ఉంది.

గయ నుండి 60 కి.మీ. బస్సుపైన కూడా ఇక్కడకు చేరవచ్చు!

భాగేశ్వర, శ్రీకృష్ణ, శివాలయాలుగల ప్రదేశము. దేహ్రీడ్యామ్ కూడా ఇక్కడ దర్శనీయమైనది

## దేవీ పీఠం : **ద్వారవతి**
## దేవీ రూపం : **రుక్మిణి**



శివకేశవులకు అభేదరూపం గలదని చాటి చెప్పే దృష్టాంతాలుగా మనకు ఎన్నో దేవాలయాలు దర్శనం ఇస్తాయి. అందులోని ఒకటి ద్వారకాధీష్ (శ్రీకృష్ణ) క్షేత్రం ఒకటి ఇదే అలనాడు ద్వారవతి

గోమతీనదీ తీరాన వెలసిన ఈ శక్తిపీఠంలో అమ్మవారు రుక్మిణి. కృష్ణసతిగా పూజింపబడే ఈ దేవీ పీఠం ఉన్న స్థానంలో  సతీదేవి యొక్క శిరోరత్నాభరణం పడినట్లుగా చెబుతారు.

శ్రీకృష్ణుని మనుమడైన వజ్రనాభుడు, ఈ నగరాన్ని ఒక్క రాత్రిలో నిర్మించాడని ఐతిహ్యం!

శక్తిపీఠ ప్రదేశం : ద్వారక

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ (రాజధానీ నగరం) నుండి 335 కి.మీ. ఓఖా పోర్ట్ నుండి 32 కి.మీ (అరేబియా సముద్ర తీరం)

స్వామి మందిరాన్ని 'జగత్ మందిరం' అని పిలుస్తారు. దేవాలయం చాలా పెద్దది.

రాష్ట్ర రాజధాని నుండి బస్సు సౌకర్యం ఉన్నది.

జిల్లా కేంద్రం జామ్‌నగర్ నుండి కూడా ఇక్కడకు చేరుకోవచ్చు!

వేణీ మాధవాలయం, బలరామాలయం, రుక్మిణీమాత ఆలయాలను కూడా సందర్శించవచ్చు!



**దేవీ పీఠం : బృందావన**
**దేవీ రూపం : రాధా**

శ్రీకృష్ణ లీలలుగా పోతనగారు భాగవతంలో వర్ణించిన ఘట్టాలు ఇక్కడే జరిగాయని ప్రతీతి. శ్రీకృష్ణునికి మేనత్త అయిన రాధ శక్తిపీఠంగా వెలసిన ప్రాంతం. సతీదేవి యొక్క భుజాభరణాలు పడిన ప్రదేశం.

శక్తిపీఠ ప్రదేశం : బృందావనం

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని, మధురకు 9 కి.మీ. దూరంలో ఉంది

ఇక్కడ మందిరం ఎరుపు రంగులో ఉండడం ఒక విశేషం. దీన్ని 'లార్డ్ రెడ్ టెంపుల్' అని కూడా అంటారు గోపీనాధ, మదన మోహన, జుగల్ కిషోర, రాధావల్లభ ఆలయాలు కూడా వున్నాయి.



**దేవీ పీఠం : మధురాపురి**
**దేవీ రూపం : దేవకీ**

రాధాకృష్ణులు విహరించిన ఈ ప్రకృతి శోభా నిలయం నికుంజవనం మధురాపురిగా అలనాడు ప్రసిద్ధమైన ఈ ప్రాంతం, శక్తిపీఠంగా వెలసింది. వడ్డాణం పడ్డ చోటు.

శక్తిపీఠ ప్రదేశం : మధుర

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాకు 44 కి.మీ. దూరంలో ఉంది.

యమునా నదీ తీరం. ఐదు వందల వరకూ వివిధ ఆలయాలున్న పవిత్ర ప్రదేశం

ఇంకా రఘునాథ, గాయత్రి, మహావిద్యా గుడులున్నాయి.



**దేవీ పీఠం : పాతాళ**
**దేవీ రూపం : పరమేశ్వరి**

అమ్మవారి కుడి కాలివ్రేళ్లు పడిన ప్రదేశంగా చెబుతారు. అమ్మవారు మహాభయంకర రూపిణి. 'భూతధాత్రి'గా ఆరాధిస్తారు.



శక్తిపీఠ ప్రదేశం : పశ్చిమబెంగాల్‌లోని బర్ధ్వాన్ జిల్లా రైల్వేస్టేషన్ నుండి 32 కి.మీ. దూరంలో ఉన్న 'క్షీర్' గ్రామం. ఇది హౌరాకు 107 కి.మీ. దూరంలో ఉంది



**దేవీ పీఠం : చిత్రకూట**
**దేవీ రూపం : సీతా**

సీతాదేవికి అనసూయ పాతివ్రత్యం బోధించిన స్థలంగాను అత్రి మహర్షి ఆశ్రమంగల స్థలంగాను సతీదేవి శరీర కాంతిరేఖలు నిక్షిప్తమైన ప్రదేశంగాను చెబుతారు.

శక్తిపీఠ ప్రదేశం : చిత్రకూటం

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బందా జిల్లాలో కర్వీ రైల్వేస్టేషన్‌కు 8 కి.మీ. దూరంలో ఉన్న సీతాపూర్ గ్రామం పయోష్ణి నదీతీరాన ఉన్నది. సత్నా నుండి 70 కి.మీ.

## దేవీ పీఠం : వింధ్య
## దేవీ రూపం : వింధ్యాధివాసిని

సతీదేవి కడుపు భాగం ఇక్కడ పడినట్లుగా చెబుతారు. కాళీమాతగా వింధ్యగా పూజిస్తున్నారు.

శక్తిపీఠ ప్రదేశం : జునాగఢ్

గుజరాత్ కాళీశిఖరం (జునాగఢ్ కొండలపై) వెలసిన ఈ అమ్మవారు జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న పర్వతాలలో కొలువైవున్నారు. ఊణా (ఆర్.ఎస్.)కు 165 కి.మీ.

## దేవీ పీఠం : కరవీర
## దేవీ రూపం : మహాలక్ష్మి



లక్ష్మీదేవిని లోకమాతగా, మంగళదేవతగా, భార్గవీదేవిగా ఆరాధించడం లక్ష్మీపార్వతులకు అభేదమని చెప్పడమే!

సతీదేవి వామహస్తం పడిన ప్రదేశంగా ప్రతీతి. ఇక్కడ అమ్మవారిని విశ్వముఖి అనీ, మహాలక్ష్మి అనీ కూడా కొలుస్తారు. తులసీ దుర్గా ఆలయం శక్తిపీఠ ప్రాంతం.

శక్తిపీఠ ప్రదేశం : జలంధర్

పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ జిల్లా కేంద్రంలో వున్నది. రాజధాని చండీఘడ్‌కు 140 కి.మీ.





**దేవీ పీఠం : వినాయక**
**దేవీ రూపం : ఉమాదేవీ**


ఎనిమిది మూలల్లోను ఎనిమిది గణనాథుల విగ్రహాలతో అలరారే వినాయక క్షేత్రంగా పూణేలోని మోరేగాం ప్రసిద్ధమైనది. ఇక్కడి స్వామి దేవదేవేశ్వరుడు. అమ్మవారు చాతుర్ శ్రింగి అనబడే ఉమాదేవి. అమ్మవారి ఆభరణాలు పడిన చోటు.

ఇక్కడ ఇంకా హనుమాన్, పాతాళేశ్వర ఆలయాలను కూడా సందర్శించగలం!

**శక్తిపీఠ ప్రదేశం : పూణే**

మహారాష్ట్రలోని బొంబాయికి 150 కి.మీ. దూరంలోను, జెజూరికి 50 కి.మీ దూరంలోను ఉంది.

జయతి గణపతి కూడా ఉన్న పూణేలో ఉమాదేవి ఆలయానికి ఎదురుగా లక్ష్మీ ఆలయం ఉండడం గమనార్హం!



**దేవీ పీఠం : వైద్యనాథ తీర్థ**
**దేవీ రూపం : ఆరోగ్యా**

అమ్మవారి శిరోభాగం పడిన ప్రదేశంగా చెబుతారు. వైద్యనాథేశ్వరిగా ఆరాధించబడుతున్న ఈ శక్తిపీఠంలో, స్వామివారు జ్యోతిర్లింగ రూపుడు.

**శక్తిపీఠ ప్రదేశం : వైద్యనాథ్ ధామ్**

బీహార్ రాష్ట్రంలో జెషిడీ రైల్వేస్టేషన్‌కు కేవలం 5 కి.మీ. దూరంలో ఉన్నది. దేవఘడ్ జిల్లాలో వైద్యనాథ్ ధామ్‌గా పిలువబడే ఈ ప్రాంతంలో జీపు ద్వారా మాత్రమే ప్రయాణించగలం!



## దేవీ పీఠం : మహాకాళ
## దేవీ రూపం : మహేశ్వరి

అవంతికాపురిగా పురాతన కాలం నుంచీ శక్తిపీఠ క్షేత్రంగా విలసిల్లుతున్న ఈ ప్రాంతంలో సతీదేవి మోచేయి పడినట్లుగా చెబుతారు.

ఇది సప్తమోక్ష పురాలలో ఒకటి. స్వామివారు మహాకాళేశ్వరుడు. ఈ లింగానికి కళ్లు ఇత్తడి సర్పం ఉన్నది.

దేవీపీఠంలో శ్రీచక్రం స్థాపించబడింది. ఈ అమ్మవారిని ఆరాధించే, కాళిదాసు మహాకవి అయినట్లుగా ప్రతీతి.

ప్రతి 12 సం॥ల కొకసారి ఇక్కడ కుంభమేళా జరుగును.

**శక్తిపీఠ ప్రదేశం : ఉజ్జయిని**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినినే మహాకాళ పీఠంగా అభివర్ణిస్తారు. ఈ క్షేత్రం షిప్రా నదీతీరంలో ఉంది.

ఇది ఇండోర్ నుండి 55 కి.మీ.

వెస్టనిమార్ జిల్లాలో ఈస్టకసర్వాడ్‌కు 10 కి.మీ.

ఉజ్జయినికి చెరొక వైపున 30 కి.మీ. పరిధిలోనే అష్టభుజాదేవి ఆలయం (కరేడీ గ్రామం); భగవతీమాత ఆలయం (దేవాసి గ్రామం) ఉన్నాయి.. ఈ ముగ్గురు అమ్మవార్లనూ 'త్రికోణయాత్ర'గా పరిగణించి దర్శిస్తూ వుంటారు. ఉజ్జయిని అమ్మవారికి కాత్యాయని అని మరో పేరు కూడా ఉన్నది.



**దేవీ పీఠం : ఉష్ణతీర్థ**
**దేవీ రూపం : అభయా**

సతీదేవి కంఠహారం పడిన ప్రదేశం

అమ్మవారి 'అభయ'గా 'నందిని'గా ఆరాధిస్తారు.

కాళీమాత ఆరాధన అధికంగా గల పశ్చిమ బెంగాల్‌లో, ఏ రూపంలో మహేశ్వరి ఆలయం ఉన్నా అక్కడి వారు అదే శక్తిపీఠంగా చెబుతుంటారు.

శక్తిపీఠ ప్రదేశం : నందిపూర్

పశ్చిమబెంగాల్‌లోని భీర్‌భం జిల్లాలో శంథియ రైల్వేస్టేషన్‌కు దగ్గరలో ఒక వటవృక్షం క్రింద ఉన్నది

ఈ ప్రాంతం సియోరికి 15 కి మీ., దూరం హౌరా నుండి 179 కి మీ., భోల్పూర్ నుండి తారాపీఠ్‌కు వెళ్లే దారిలో ఉన్నది



**దేవీ పీఠం : వింధ్య పర్వత**
**దేవీ రూపం : నితంబా**

సతీదేవి పిరుదు పడిన ప్రదేశంగా చెప్తారు అమ్మవారు ఇక్కడ విగ్రహ రూపంలో కాక జ్వాల రూపమున కన్పిస్తుంది. కొండల్లోంచి మంటలు వచ్చే చోట గుర్తులపై అగ్గిపుల్ల వెలిగించి మంటల్ని దర్శించవచ్చు!

శక్తిపీఠ ప్రదేశం : వైష్ణోదేవి (జ్వాలాముఖి) కాంగ్డా

హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్డా జిల్లా కేంద్రం నుంచి 20 కి.మీ. దూరంలో ఉన్న కాళీధర్ పర్వతం మీద వెలసిన వైష్ణోదేవి ఆలయం. అమ్మవారిని జ్వాలాజీ అంటారు. ధర్మశాల్ ఇక్కడికి 82 కి.మీ.

ఇక్కడ వేడినీటి ఊటలు కూడా ఉన్నాయి.

## దేవీ పీఠం : మండవ్య
## దేవీ రూపం : మాండవి



శక్తిపీఠ ప్రదేశం : షికార్‌పూర్

సతీదేవి ముక్కు భాగం ఇక్కడ పడినట్లుగా చెబుతారు.

బంగ్లాదేశ్‌లో సునందా నదీ తీరాన, భరిసార్‌కు 20 కి.మీ. దూరంలో ఉన్నదీ శక్తిపీఠం. 'ఉగ్రతార' అమ్మవారుగా కొలువైవున్న ఈ దేవికి అక్కడ హిందువుల చేత పూజా పురస్కారాలు జరుగుతున్నట్లుగా చెపుతారు.

## దేవీ పీఠం : మహేశ్వరీపురి
## దేవీ రూపం : స్వాహా

సతీదేవి కుడికాలి చీలమండ పడిన ప్రదేశంగా భావిస్తారు. సావిత్రిగా, స్వాహాగానూ అర్చిస్తారు.

శక్తిపీఠ ప్రదేశం : ద్వైపాయన సరోవరం

హర్యానా రాష్ట్రంలో కురుక్షేత్ర జిల్లాలో ద్వైపాయన సరస్సు వద్ద వెలసిన శక్తిపీఠం.

పిప్లీ నుంచి 7 కి.మీ.; థానేశ్వర్ నుంచి 5 కి.మీ. వివిధ పేర్లతో పిలువబడే సరస్సులు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి.

మహామాయి ఆలయం; శ్రీకృష్ణాలయం కూడా దర్శనీయం!



## దేవీ పీఠం : భగలాండ
## దేవీ రూపం : ప్రచండా

అమ్మవారి ఎడమచేయి పడిన చోటుగా చెబుతారు. అమ్మవారు ప్రచండ్డ చండి.

కలకత్తా పరిసరాలలో శక్తిపీఠాలుగా చెప్పబడేవి అధికం.

శక్తిపీఠ ప్రదేశం : కేతుబ్రహ్మ గ్రామం

పశ్చిమబెంగాల్‌లో భీర్‌భం జిల్లాలోని కేతుబ్రహ్మ గ్రామం, శాంతినికేతన్‌కు దగ్గర్లో ఉంది. అహ్మద్‌పూర్ నుంచి ఇక్కడకు చేరవచ్చు!

శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ

చిదగ్ని కుండ సంభూతా, దేవకార్య సముద్భవా ॥ అని లలితా సాహస్రిలో కీర్తించబడినది అమ్మవారు.



## దేవీ పీఠం : అమరకంఠక
## దేవీ రూపం : చండికా

సతీదేవి కంఠం పడిన ప్రదేశం. జమ్మూ కాశ్మీర్‌లో ఉన్న అతితక్కువ హిందూ ఆలయాలలో ఇదొకటి. అమ్మవారు మంచు లింగ రూపంలో వెలసిందని చెపుతారు. చండిగా, అమరనాథేశ్వరిగా పూజిస్తారు.

శక్తిపీఠ ప్రదేశం : అమరనాథ్ గుహ

జమ్ము & కాశ్మీర్‌లో లిడ్డర్ నదీ తీరాన లిడ్డర్ లోయలో ఉన్న అమరనాధ గుహలో వెలసిన శక్తిపీఠం. పహల్గాంవ్‌కు 46 కి.మీ. ఇక్కడ ముస్లింలే పూజా ప్రసాదం ఇస్తారు.



## దేవీ పీఠం : సోమేశ్వర
## దేవీ రూపం : వరారోహా

ఇక్కడ సతీదేవి ఎడమ ప్రక్క వీపుభాగం పడినట్లుగా తెలుస్తోంది. అమ్మవారు అపర్ణాదేవి. అంబకు కాత్యాయనీ, గౌరీ, హైమవతీ, ఈశ్వరీ, శివ, భవానీ, రుద్రాణి, అపర్ణ అనేది అష్టమూర్తులు.

శక్తిపీఠ ప్రదేశం : భవానీపూర్ (బంగ్లాదేశ్)

బంగ్లాదేశ్‌లో చేరియున్న ప్రాంతంలో భవానీపూర్, బాగడా రైల్వేస్టేషన్‌కు 32 కి.మీ. దూరంలో ఉంది.

కరత్రోయా నదీ తీరంలో వెలసిన ఈ అమ్మవారి దర్శనం కూడా మనం చేయడం దుర్లభమే!



## దేవీ పీఠం : ప్రభాస
## దేవీ రూపం : పుష్కరావతి

సతీదేవి చెక్కిలి భాగం పడిన ప్రదేశంగా చెబుతారు. శ్రీకృష్ణుడు నిర్యాణం చెందిన ప్రదేశంగా భావిస్తారు. కపిల, సరస్వతి, హిరణ్య నదులు సముద్రంలో కలిసే చోటు.

శక్తిపీఠ ప్రదేశం : ప్రభాస తీర్థం

గుజరాత్ రాష్ట్రంలోని సోమనాధ్‌కు 7 కి.మీ. దూరంలో ఉన్న వీర్‌వల్‌లో వున్నది. ఈ శక్తిపీఠం. జునాగఢ్ జిల్లాలో ఉన్న ఈ ప్రభాస తీర్థంలో 10సార్లు స్నానం చేస్తే, ఆరుసార్లు కాశిని సందర్శించినంత పుణ్యం లభిస్తుందని వానుడి. ఇది ప్రాచీన త్రివేణీ సంగమ క్షేత్రం.



దేవీ పీఠం : **సరస్వతి**
దేవీ రూపం : **దేవమాతా**

శ్రీలంకలో శాంకరీదేవి ఆలయదర్శనం దుర్లభం అయినట్లుగానే, కాశ్మీరంలో నేడు సరస్వతీదేవి దర్శనం సైతం దుర్లభమే!

ఇక్కడ అమ్మవారి కుడిచెంప భాగం పడినట్లుగా చెబుతారు.



ప్రస్తుత జమ్ము & కాశ్మీరు రాష్ట్రము ప్రముఖంగా ముస్లిమ్‌ల నివాసం. హిందూ ఆలయాలు తక్కువ

శక్తిపీఠ ప్రదేశం : కాశ్మీర్

ఈ రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌కు సుమారు 10 కి.మీ దూరంలో రుష్యశృంగ శాంతాదేవి ఆలయం ఉంది. ఇక్కడ శంకరాచార్యాలయం కూడా ఉంది.

కాశ్మీరంలో శ్రీ ఆదిశంకరాచార్యుల వారు పర్యటించినపుడు, మరుగున పడిపోయిన సరస్వతీ పీఠాన్ని కనుగొన్నట్టు ఈ సువర్ణ శారదామాతను అందరూ పూజించేలా చేయదలచి, ఆవిడను అక్కడ్నుంచి కర్ణాటక రాష్ట్రంలోని శృంగేరీ పీఠానికి తరలించి శారదాపీఠం పేరిట ప్రతిష్ఠించినట్టు చెప్పుకుంటారు.

అందువల్ల శంకరాచార్య ఆలయాన్నే కాశ్మీర్‌లో శక్తిపీఠంగా భావించి కొందరు కొలుస్తున్నారు అమ్మవారు లేరు.

## దేవీ పీఠం : మహాలయ
## దేవీ రూపం : మహాభాగా

సతీదేవి ఎడమభుజం పడిన ప్రదేశం. అమ్మవారిని మహాదేవి అనీ  ఉమాదేవి అనీ పిలుస్తారు.

ప్రస్తుతం నేపాల్‌లో అభద్రతా కారణాలవల్ల ప్రయాణం ఆలోచించే ముందు పరిస్థితులు సమీక్షించుకోవడం ఉత్తమం!

శక్తిపీఠ ప్రదేశం : జనకపూర్ థామ్ (నేపాల్)

జనకపురిరోడ్ రైల్వేస్టేషన్‌కు 32 కి.మీ.; సీతామర్హి ఆర్.ఎస్.కు 42 కి.మీ.

భారత కరెన్సీని నేపాలీ కరెన్సీలోకి మార్చుకోవాలి. భారత భూభాగంపై 32 కి మీ. నేపాల్ భూభాగం మీద 16 కి.మీ. ప్రయాణం.

## దేవీ పీఠం : పయోష్ణి
## దేవీ రూపం : పింగళేశ్వరి



శక్తిపీఠ ప్రదేశం : హింగలాజ్ (పాకిస్తాన్)

సతీదేవి 'మాడు' భాగం పడినట్లుగా చెబుతారు. హింగ్రోస నదీ తీరంలో లాస్బేల జిల్లాలో వున్నదీ శక్తిపీఠం. ఇది కరాచీ నుండి 150 కి.మీ.

పాస్‌పోర్టు  వీసా వగైరా లున్నవారు దర్శించగలరు. ప్రస్తుత పరిస్థితులలో టూరిస్టులు తగ్గారు.



**దేవీ పీఠం : కృతశౌచ**
**దేవీ రూపం : సింహికా**

సతీదేవి కుడిభుజం పడిన ప్రదేశంగా భావిస్తున్నారు. చాలా శక్తిపీఠాలు (ఒకప్పుడు) ఉండే ప్రాంతం చుట్టూ నేడు నగర విస్తరణ జరిగి ఉండవచ్చు!

శక్తిపీఠ ప్రదేశం . చెన్నయ్

స్వామివారు కపాలేశ్వరుడు అమ్మవారు కపాలేశ్వరి తమిళనాడు రాష్ట్రంలోని చెన్నయ్ మహానగరంలోనే, మైలాపూర్‌లో ఉన్నదీ శక్తిపీఠం. తమిళంలో మైలి అంటే నెమలి అని అర్థం!



**దేవీ పీఠం : కార్తీక**
**దేవీ రూపం . అతిశాంకరీ**



శక్తిపీఠ ప్రదేశం · శ్రీలంక (సింహళం)

ఇక్కడ అమ్మవారి కాలిగజ్జెలు పడినట్లుగా తెలుస్తోంది 'ఇంద్రాక్షి' నామధేయ.

లంకాయాం శాంకరీ దేవీ' అని అష్టాదశ పీఠ నిరూపక శ్లోకంలో ప్రారంభంలోనే ఉన్నా, ఈనాటి శ్రీలంకను శోధిస్తే ఎక్కడా శాంకరీ దేవి ఆలయం కన్పించడం లేదు

పోర్చుగీసు, డచ్చి, ఇంగ్లీషు వారి పరిపాలనలలో ఎన్నో హిందూ ఆలయాలు శిథిలమైనాయి. (పోర్చుగీసు వారివల్ల రావణాలయం ధ్వంసమై చర్చి కట్టారు.)

విజ్ఞులు చేసిన స్థల నిర్ధారణ ప్రకారం - ప్రస్తుతం ట్రింకో మలిపురం అని చెప్పబడుతున్న ప్రాంతంలో ఈ శక్తిపీఠం ఉండి ఉండాలి! ప్రస్తుతం శాంకరీ దర్శనం దుర్లభమే!



**దేవీ పీఠం : వర్తక**
**దేవీ రూపం : ఉత్పలా**

సతీదేవి కంకణం పడిన ప్రదేశం. అమ్మవారు మంగళచండీ దేవిగా ఉత్పలాక్షిగా ఆరాధించబడుతున్నది. దేవి ఆభరణాలు కూడా, ఆమెకు సహజ భూషణాలై భాసించుట చేత వీటినీ శక్తిపీఠాలన్నారు.

శక్తిపీఠ ప్రదేశం : చండీతల్

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సియాల్‌దహ రైల్వేస్టేషన్ నుండి 57 కి.మీ.

బెంగాల్ రాష్ట్రంలోని కాళీ, చండీ ఆలయాలలోని అధిక భాగం అమ్మవారు ఉగ్రరూపిణి. ఎర్రని నాలుక బైటకు జాపి, భయంకరంగా దర్శనమిస్తుంది.




**దేవీ పీఠం : సోనసంగమ**
**దేవీ రూపం : సుభద్రా**

శోణ సంగమ స్థానంలో వెలసిన శక్తి పీఠాలలో ఇదీ ఒకటి. ఇక్కడ అమ్మవారి జంఘిక పడినట్లు చెబుతారు

శక్తిపీఠ ప్రదేశం : పూర్ణగిరి

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో, నేపాల్ సరిహద్దున గల శక్తిపీఠం ఇది. టకన్‌పూర్‌లో ఉన్న ఈ పూర్ణగిరి, ఆల్మోరా జిల్లా కేంద్రానికి 15 కి.మీ.

కాళికగా అర్చించబడే ఈ శక్తి శ్రీకృష్ణుని సహోదరి సుభద్రావతారంగా భావిస్తారు.



దేవీ పీఠం : **సిద్ధవన**
దేవీ రూపం : **మా లక్ష్మి**

సతీదేవి దంతపంక్తి పడిన ప్రదేశంగా చెబుతారు. స్వామివారు జ్యోతిబా. వీరికి ఆలయం ఇక్కడి నుండి 20 కి.మీ. దూరంలో ఉంది. అమ్మవారిని వివిధ పేర్లతో పిలిచినా మహాలక్ష్మి నామధేయమే శ్లోకంలో చెప్పబడింది.

శక్తిపీఠ ప్రదేశం : కొల్హాపూర్

మహారాష్ట్రలోని కొల్హాపురం మాలక్ష్మీ పీఠంగా విలసిల్లుతోంది షోలాపూర్ నుండి బస్సు రైలు సౌకర్యం ఉంది. పూనాకు గోవాకు మధ్య ఉన్నది. పన్హాలా నుండి 18 కి.మీ రత్నగిరి నుండి 125 కి.మీ.



దేవీ పీఠం : **భరతాశ్రమ**
దేవీ రూపం : **అనంగా**

అమ్మవారి హృదయకోశం పడిన ప్రదేశంగా చెబుతారు. కొందరు అమ్మవారి దక్షిణ వక్షోజం పడిన ప్రదేశంగా చెబుతారు.

ఈ మాతను, శ్రీకృష్ణుని పతిగా పొందడానికి, రుక్మిణి ప్రార్థించిందట!

శక్తిపీఠ ప్రదేశం : అరసూర్

గుజరాత్ రాష్ట్రంలోని అరసూర్‌లో వెలసిన శక్తిపీఠ ప్రాంతం మౌంట్ అబూకు 32 కి.మీ. దూరం.

ఈ శక్తిపీఠం (అంబాజీ ఆలయం) ప్రక్కనే కోటేశ్వర మహాదేవుని ఆలయం దర్శించదగ్గది



## దేవీ పీఠం : జలంధర
## దేవీ రూపం : విశ్వముఖీ

సతీదేవి కర్ణము పడిన ప్రదేశంగా చెబుతారు. అమ్మవారు వింధ్య వాసిని. శుంభ నిశుంభులనే రాక్షసులను పరిమార్చిన మాత. అష్టభుజాలు కలిగి మహిషాసుర మర్దిని ఆకృతిలో పూజలందుకొంటున్నది.

శక్తిపీఠ ప్రదేశం : వింధ్యాచలం

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ జిల్లాలో అలహాబాద్‌కు 80 కి.మీ. దూరంలో ఉన్న వింధ్యాచలం శక్తిపీఠ ప్రాంతం. గంగానదీ తీరాన ఇక్కడికి దగ్గరలో వానుకి అనే సర్పరాజాలయం దర్శించదగ్గది.



## దేవీ పీఠం : కిష్కింధ పర్వత
## దేవీ రూపం : తారా

అమ్మవారి ఆభరణాలు పడిన ప్రదేశంగా చెబుతారు.

కిష్కింధ  మాల్యవంత పర్వతాలతో పాటు, మరో 3 పర్వతాలు కూడా ఉన్న ప్రదేశం. తుంగభద్రా తీరం. అమ్మవారు తారాదేవి.

శక్తిపీఠ ప్రదేశం : హంపి

కర్నాటక రాష్ట్రంలోని హంపీ విజయనగరం. బళ్లారి జిల్లా హోస్పేటకు 10 కి.మీ. దూరంలో ఉన్నది.

విరూపాక్ష ఆలయానికి 6 కి.మీ. దూరంలో ఉన్న ఈ పర్వతంపైన అమ్మవారి ఆలయం; విరలేశ్వరాలయం దర్శనీయాలు.



## దేవీ పీఠం : దేవదారువన
## దేవీ రూపం : పుష్టి

సతీదేవి జఘనభాగం పడిన ప్రదేశం. అమ్మవారు బృహన్నాయకి. స్వామివారు బృహదీశ్వరుడు. పానవట్టము, (లింగం కూడా) చాలా పుష్టిగా భారీగానే ఉంటాయి. అమ్మవారు 'తంజం' అనే రాక్షసుని సంహరించిన చోటుగా కూడా చెపుతారు. దీనిని 'దక్షిణ మేరు' అని కూడా అంటారు.

క్తిపీఠ ప్రదేశం : తంజావూరు

తమిళనాడు రాష్ట్రంలో కుంభకోణానికి 40 కి.మీ. దూరంలో ఉంది. జిల్లా కేంద్రం ంజావూరు. వేదారణ్యం నుంచి 135 కి.మీ

జ్వర హరేశ్వరస్వామి (మంచి గంధం పూత సేవ చేసినచో జ్వరాలు తగ్గించే స్వామి) గుడి దర్శనీయం!



## దేవీ పీఠం : కాశ్మీర మండల
## దేవీ రూపం : మేధా

సతీదేవి మెదడు (మేధస్సు) పడిన ప్రదేశంగా చెపుతారు అమ్మవారిని ఖీర్ భవాని అంటారు. ఈ ఆలయం చుట్టూ నీరు నిండి ఉంటుంది. రంగులు మారుతుంటుంది.

శక్తిపీఠ ప్రదేశం : తులుముల

జమ్ము & కాశ్మీర్ రాష్ట్రంలో శ్రీనగర్‌కు 40 కి.మీ. దూరంలో ఉంది. గండర్బల్ నుంచి 5 కి.మీ. జమ్ము & కాశ్మీర్ రాష్ట్రంలో ఇప్పటికీ పూజలందుకుంటున్న శివసతి ఆలయం ఇదే కావడం ఒక విశేషం. (అనాదిగా పూజ).

## దేవీ పీఠం : హిమాద్రి
## దేవీ రూపం : భీమా

సతీదేవి కంఠం పడిన ప్రదేశంగా చెపుతారు. అమ్మవారు గాలేశ్వరి లేక భీమ అని పూజింపబడుతున్నది. 'గళం' అనగా మెడ. కనుకనే అమ్మవారికి ఈ పేరు వచ్చిందంటారు. సమీపంలో ఉన్న ముక్తినాథ క్షేత్రంలో మంచు నీరు పైన జ్వాలలను మనం ఒక గుహలో దర్శిస్తాం!

శక్తిపీఠ ప్రదేశం : గాలేశ్వర్

నేపాల్‌లోని ముక్తినాథ క్షేత్రానికి వెళ్లేదారిలో ఉన్నది గాలేశ్వర్.

పోఖ్రా నుండి 55 కి.మీ ఇది జిల్లా కేంద్రం కూడా. బస్సు సౌకర్యం ఉంది.

నదీ ప్రవాహం తీరం వెంబడి సాలగ్రామ శిలలు బాగా లభిస్తాయని ప్రతీతి.

## దేవీ పీఠం : కపాలమోచన
## దేవీ రూపం : శుద్ధి

ఇక్కడ సతీదేవి దివ్యాభరణాలు పడిన ప్రదేశమని చెపుతారు. అమ్మవారు చాముండి. శుద్ధిదేవత మైసూరు మహారాజులకు ఆరాధ్య.

శక్తిపీఠ ప్రదేశం : మైసూరు

కర్నాటక రాష్ట్రంలోని మైసూరుకు 13 కి.మి. దూరంలొ చాముండ హిల్సపై వెలసిన శక్తి పీఠాధిష్ఠాన దేవత.

తలక్కాడ్ పంచలింగ క్షేత్రం నుంచి 65 కి.మీ.; బేలూర్ నుంచి 120 కి.మీ.



## దేవీ పీఠం : కాయావరోహణ
## దేవీ రూపం : మాతా

ఇక్కడ సతీదేవి శరీరాంతర్గత వజ్రాస్తికలు పడినట్లు ప్రతీతి. అమ్మవారు జోగులాంబగా ఆరాధించబడుతోంది. ఇక్కడ సప్తమాతృకల విగ్రహాలు కూడా ఉన్నాయి. నవ బ్రహ్మలకు ఇక్కడ తప్ప ఇంకెక్కడా విగ్రహాలు లేకపోవడం ఒక ప్రత్యేకత.

**శక్తిపీఠ ప్రదేశం : అలంపురం**

ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లాలో కర్నూలు నుంచి 40 కి.మీ. దూరంలో ఉన్నది అలంపురం.

కృష్ణా తుంగభద్రా నదుల సంగమ స్థానం. ఎన్ని బిందెలనీళ్లు అభిషేకం చేసినా చుక్క నీరు - బైటికి రాదు. ఒకనాటి ముస్లిం పాలకుల ప్రభావం నేటికీ ఆలయం కొంత ముస్లిం అధీనం.



## దేవీ పీఠం : శంఖోద్ధార
## దేవీ రూపం : ధరా

సతీదేవి చుబుకం (శంఖం వంటి గడ్డం) పడిన ప్రదేశంగా భావిస్తున్నారు. అమ్మవారు ధరాదేవి భ్రామరీదేవిగా పూజింపబడుతోంది. ఈశ్వరీ మాతగాని, త్రయంబకేశ్వరుడు గాని ఇక్కడ నిరాకారులు.

**శక్తిపీఠ ప్రదేశం : పంచవటి (నాసిక్)**

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో, జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న పంచవటి. గోదావరీ తీరం.

నాసిక్ నుండి 8 కి.మీ.; త్రయంబక్ నుండి 32 కి.మీ. దగ్గరలోనే కాలారాం ఆలయం దర్శించదగ్గది.



## దేవీ పీఠం : పిండారక
## దేవీ రూపం : ధృతి

ఇక్కడ అమ్మవారి అధోదంత పంక్తి పడినట్లుగా చెపుతారు. ధృతి లేక 'వారాహి' అని పిలువబడే అమ్మవారు. దర్శనం దుర్లభం. ధగ్గులు - పిండారులు అనే దోపిడి దొంగలచే దోచుకోబడిందంటారు.

శక్తిపీఠ ప్రదేశం : పంచసాగర్ (పాకిస్తాన్)

నేడు ఇతర దేశాలుగా విడిపోయినా, ఒకప్పుడు ఈ భారత భూమి అఖండం. 'భరత వర్షే భరత ఖండే' అని సంకల్పంలో మనం ఇంకా చెప్పుకుంటున్న జంబూద్వీపంలోని మన దేశం కాలప్రవాహంలో విదేశీ దండయాత్రలకు దోపిడీలకు గురికాబడి ఎన్నో కోల్పోయిందన్నది చారిత్రక సత్యం!



## దేవీ పీఠం : చంద్రభాగ
## దేవీ రూపం : కళా

సతీదేవిపై దంతపంక్తి పడిన ప్రదేశంగా భావిస్తున్నారు. నవగ్రహాలు ఇక్కడ మంటపం పై కప్పులోనే చెక్కబడి ఉండటం ప్రత్యేకత.

శక్తిపీఠ ప్రదేశం : శుచీంద్రం

తమిళనాడు రాష్ట్రంలో కన్యాకుమారికి 19 కి.మీ. నాగర్‌కోయిల్ - కన్యాకుమారి మధ్యలో గలదు. స్వామివారు ధర్మ సంవర్ధన. స్థానేశ్వరుడు. వినాయకాలయం కూడా కలదు.

నాగర్‌కోయిల్ నుంచి 19 కి.మీ. దూరంలో ఉన్నది.



## దేవీ పీఠం : అక్కోద
## దేవీ రూపం : శివధారిణి

సతీదేవి మోకాళ్లు పడిన ప్రదేశం భాగమతీ నదీతీరం. స్వామివారు పశుపతి నాథుడు. ఇక్కడ జంతు బలుల ఆచారం ఇంకా కొనసాగుతోంది. మహాశివరాత్రి రోజున రథోత్సవం ఉన్నది రథానికి పశువుల బలిఇచ్చిన మాంసఖండాలు కడతారు.

**శక్తిపీఠ ప్రదేశం : ఖాట్మండు (నేపాల్)**

నేపాల్ దేశ రాజధాని. భక్తపూర్‌కు-12 కి మీ.

ఇక్కడ మనం 4 ముఖాలు గల శివుని దర్శించవచ్చు! అమ్మవారు గుహ్యేశ్వరి. నాలుగు దిక్కులలోను ఉన్న నాలుగు ద్వారాల నుంచీ శివుని దర్శిచంగల వీలున్నది.



## దేవీ పీఠం : వేణా
## దేవీ రూపం : అమృతా

సతీదేవి అమృత హృదయం పడిన ప్రదేశమని భావిస్తున్నారు. ఆలయానికెదురుగా అమృతోపమానమైన వేడినీటి సరస్సులో నీరు వ్యాధి నివారణ కారకం.

**శక్తిపీఠ ప్రదేశం : బక్రేశ్వర్**

పశ్చిమబెంగాల్‌లోని భీర్‌భం జిల్లాలో బక్రేశ్వర్ అనే ప్రాంతంలో వెలసిన శక్తిపీఠం. శాంతినికేతన్ నుండి .... కి.మీ.; దుబ్రాజ్‌పూర్ రైల్వేస్టేషన్ నుండి 12 కి.మీ.; స్తియూరి నుండి 22 కి.మీ.



**దేవీ పీఠం : బదర్యాశ్రమ**
**దేవీ రూపం : ఊర్వశి**

ఇక్కడ సతీదేవి ఎడమ తొడ పడినట్లుగా చెబుతారు. అమ్మవారు జయంతిగా ఆరాధించబడుతోంది

శక్తిపీఠ ప్రదేశం : బావుర్‌భాగ్

మేఘాలయ రాష్ట్రంలో షిల్లాంగ్ నుంచి 55 కి.మీ. దూరంలోని బావుర్‌భాగ్ అనే చోట వెలసి వున్న అమ్మవారు.



**దేవీ పీఠం : ఉత్తరకురు**
**దేవీ రూపం : ఔషధి**

అమ్మవారి శిరోభాగం పడిన ప్రదేశంగా చెబుతారు. అమ్మవారిని శాకంబరీ దేవిగా ఆరాధిస్తారు.

శక్తిపీఠ ప్రదేశం : సహరాన్‌పూర్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో శాకంబరి అనే శక్తిపీఠ ప్రాంతం సహరాన్‌కు 40 కి.మీ. దూరంలో ఉంది. సహరాన్‌పూర్ జిల్లా కేంద్రం కూడా!



**దేవీ పీఠం : కుశద్వీప**
**దేవీ రూపం : కుశోభా**

ఇక్కడ సతీదేవి కుడి పాదం పడిన ప్రదేశంగా చెబుతారు. అమ్మవారు త్రిపురసుందరిగా లోకమాతగా ఆరాధించబడుతోంది.

శక్తిపీఠ ప్రదేశం : రాధాకిశోర్‌పూర్

త్రిపుర రాష్ట్రంలో ఉన్న ఈ శక్తిపీఠం శ్రీకృష్ణపరమైన దివ్యక్షేత్రం. అగర్తలకు 65 కి.మీ.





**దేవీ పీఠం : హేమకూట**
**దేవీ రూపం : మన్మధా**

అమ్మవారి కంకాళం పడిన ప్రదేశంగా భావిస్తున్నారు. ఆదిశంకరాచార్యులచే శ్రీచక్రం స్థాపించబడింది. స్వామివారు ఏకామ్రేశ్వరుడు అమ్మవారు హేమ (బంగారు) విగ్రహం రావిచెట్టు పూజ గూడ కదు.

శక్తిపీఠ ప్రదేశం : కంచి

తమిళనాడు రాష్ట్రంలోని కంచిలో ఉన్నది. అమ్మవారిది కామా(మన్మధా)క్షి రూపం చెంగల్పట్ జిల్లా చెన్నయ్‌కు 70 కి.మీ స్వామి మట్టి లింగం కనుక, అభిషేకం లేదు. మల్లెపూల పూజ కలదు

ఫిబ్రవరి మార్చిలలో ఇక్కడ రధోత్సవం జరుగుతుంది.



**దేవీ పీఠం : కుముద**
**దేవీ రూపం : సత్యవాదినీ**

ఇక్కడ సతీదేవి నాలుక భాగం పడినట్లుగా కొందరు వచిస్తున్నారు. సత్యవాదనమే అవుగాక! అమ్మవారు సువర్ణ శారద కొందరు దక్షిణ హస్తం అంటారు.

శక్తిపీఠ ప్రదేశం : శృంగేరి

కర్నాటక రాష్ట్రంలోని శృంగేరీ పీఠం. తుంగభద్రానదీ తీరాన ఉన్నది షిమోగా నుండి చిక్మగలూర్ నుండి బస్సు సౌకర్యం ఉంది.

శ్రీ శంకరాచార్యుల వారిచే ప్రతిష్ఠితమైన మొట్టమొదటి పీఠంగా వాసికెక్కింది

ఇక్కడ భక్తులకు ఉచిత వసతి ఏర్పాట్లున్నాయి.



## దేవీ పీఠం : అశ్వత్థా
## దేవీ రూపం : వందనీయ

సతీదేవి చేతివ్రేళ్లు ఇక్కడ పడినట్లుగా చెబుతున్నారు. అమ్మవారు అంగుళీయక చండిగా ఆరాధించబడుతున్నది. రావి వృక్షంలో నెలకొని, ముఖ్యంగా వివాహసమయమందు ఆరాధించబడే అమ్మవారుగా కూడా ప్రసిద్ధి.

శక్తిపీఠ ప్రదేశం : 'మో' గ్రామం

పశ్చిమ బెంగాల్‌లోని 'మో' గ్రామం. ఖట్వా నుండి 12 కి.మీ.; నవ ద్వీపధామ్‌కు 38 కి మీ

అమ్మవారు ఉగ్రరూపిణి కాదు. శ్రీకృష్ణ రుక్మిణీ క్షేత్రమైన నవద్వీపం కూడా దర్శనీయమే! కల్యాణేశ్వరిగా కొందరు పూజిస్తారు.



## దేవీ పీఠం : వైశ్రవణాలయ
## దేవీ రూపం : నిధి

సతీదేవి ఆభరణాలు / వాటియందుండే వెలగల రాళ్లు (వజ్ర వైఢూర్యాలు) కొలువైన ప్రదేశం.

శక్తిపీఠ ప్రదేశం : కుబేరుల (ధనికుల) ఇళ్లలో

అతిగొప్ప శక్తిపీఠం ఇది ప్రపంచాన్ని శాసిస్తున్న ధనం దాని ననుసరించి పదవి తద్వారా ఒనగూడే సుఖభోగాలు .. వీటన్నిటికీ మూలమైనది ఆదిశక్తి. ఆమెయే వైశ్రవణాలయ. వారాహి. వైష్ణవి.

దేవీ పీఠం . వేదపఠన
దేవీ రూపం : గాయత్రీ



ఓం "కాత్యాయనాయ విద్మహే కన్యకుమారి ధీ మహిః ।
తం నో దుర్గిః ప్రచోదయాత్" అని దేవీ గాయత్రి.

శక్తిపీఠ ప్రదేశం . వేదాలలో

మొత్తం వాఙ్మయం అంతా 'అ'కారం నుండి 'హ'కారం వరకు గల అక్షరాల్లోనే ఉంది ఈ అక్షరాలు మొత్తం నాదరూపజగత్తును సృష్టిస్తున్నాయి

అ బ్రహ్మము; హ శక్తి ఈ రెండిటి సమాహారమే 'అహం' అవుతున్నది ఇదే సర్వధాతువుల్నీ పోషించే ధాత్రిగా శబ్ద సృష్టి చేసే సరస్వతిగా, తనను గానం చేసేవారిని రక్షించడం చేత . అనగా పునర్జన్మ లేకుండా కటాక్షించడంచేత 'గాయత్రి' అని చెప్పబడుతున్నది ఇది ఒక్కొక్క దేవతపట్ల ఒక్కో ఛందస్సుతో విరాజిల్లుతున్నది.



**దేవీ పీఠం : శివసన్నిధి**
**దేవీ రూపం : పార్వతీ**

ఈ శక్తిపీఠం ఈశ్వర గృహేశ్వరిది. అనగా పార్వతీదేవిది. అసలు ఈశ్వరార్థాంగ శరీర ఐన ఉమాసుందరి నిరంతర శివసాన్నిధ్య. ఈ శక్తిని వేరుచేసి చూప/చూడ జాలము. కనుకనే .

శక్తిపీఠ ప్రదేశం : ఈశ్వరుని గుడిగల ప్రతిచోట.

పార్వతీదేవి వుండగలదు. అమ్మవారిని అర్చించదలచిన ప్రతివారూ స్వామివారిని అర్చించడం మనకు అనుభవైక వేద్యమే! ప్రతీ శివమందిరంలో అంతర్గతంగా శక్తిపీఠం ఇమిడే ఉంటుందని సూచితం!



**దేవీ పీఠం : దేవలోక**
**దేవీ రూపం : ఇంద్రాణీ**

సప్తమాతృకలలో ఒకటైన ఇంద్రాణి, దేవలోక శక్తిపీఠ సంస్థిత. అధినాయకుడు ఇంద్రుడు ఇంద్రాణి శచీదేవి. స్వర్గపట్టణం అమరావతి.

శక్తిపీఠ ప్రదేశం : స్వర్గ పట్టణంలో

సమస్త సంపదలకు నిలయమై; పారిజాత కల్పవృక్ష కామధేను వంటి దివ్య వృక్ష పశుగణాలకు ఆలవాలమై వెలుగొందే స్వర్గపట్టణ శక్తిపీఠం సాధించాలని ప్రతి నరుడూ ఆశిస్తాడు. స్వర్గ సౌఖ్యసాధన కోసం వివిధ దేవతారాధనలూ, పూజలూ, వ్రతాలూ ఆచరిస్తూనే వుంటాడు. శ్రద్ధాభక్తులకు ఇది సాధ్యమే!



**దేవీ పీఠం : బ్రహ్మలోక**
**దేవీ రూపం : సరస్వతీ**

ఈమె వాగ్రూపమైన పరాశక్తి వికాసం. క్రమంగా కంఠ గతం - తాళం గతం అయి, వాగ్వైఖరిగ రూపాంతరం చెంది, శ్రుతి గోచరమై ప్రపంచాన్ని నడిపిస్తున్నది. బ్రహ్మము, ఈ శక్తి మూలక ప్రయత్నం చేతనే అక్షర సమామ్నయ స్వరూపాన్ని పొందింది.

శక్తిపీఠ ప్రదేశం : వాగ్దేవి సన్నిధి

పెదవులు, దౌడలు, నాలుక, కంఠం మొ॥ వాటి ప్రయత్న (శక్తి) పూర్వక వివిధ విన్యాసాల చేత వాగ్దేవి రకరకాల అక్షరాలుగా వినిపిస్తోంది. కనుకనే మనం పదాలు, వాక్యాల కూర్పుతో ఎంతో విస్తారమైన గ్రంథ రాజాలను సైతం కూర్చగలుగుట జరుగుచున్నది.

ఇదీ శక్తిపీఠ రూపంలో వెలసిన వాగ్దేవీ వైభవం.




**దేవీ పీఠం : సూర్యబింబ**
**దేవీ రూపం : ప్రభా**

కాంతివంతమైన (ప్రభా) మండలమున సూర్యబింబ రూపమున ప్రకాశించు చిత్‌శక్తి దేవీశక్తి పీఠమే తప్ప అన్యము కాదని విజ్ఞులెరుగుదురు.

శకిపీఠ ప్రదేశం : సూర్య మండలంలో

సూర్యబింబమున వెలసిన ఈ శక్తిని, ప్రతి నరుడూ కేవలం ఉపాసన ద్వారా దర్శించగలడు. సంధ్యావందనం అనే శ్రీవిద్యోపాసన (బ్రహ్మవిద్యా సందర్శన) సాక్షాత్ సూర్య భగవానుని యందు సంస్థిత అయిన శక్త్యార్చనమే!



## దేవీ పీఠం : మాతృలోక
## దేవీ రూపం : వైష్ణవీ

దేవి విశ్వరూపిణి. జగన్నాయకి. అనగా.... జగన్నాథుడైన విష్ణువు నాయకుడు కాగా వైష్ణవి ఇట నాయిక. ఆమె మాతృలోక శక్తిపీఠ సంస్థిత. నివాసం వైకుంఠం. అందునా శ్రీహరి హృదయ కమలం.

శక్తిపీఠ ప్రదేశం : సప్తమాతృకలలో

విష్ణు వక్షస్థలాలయ అయిన వైష్ణవిని సప్తమాతృకలలో ఒకటిగా ఆరాధించడం ద్వారా సాధకులు దేవి అనుగ్రహానికి పాత్రులు కాగలుగుతున్నారు.

ఆ సప్తమాతృకలు వీరే! 1. బ్రహ్మి 2. మాహేశ్వరి 3. కౌమారి 4. వారాహి 5. వైష్ణవి 6. ఇంద్రాణి 7 చాముండి. సాధారణంగా సప్తమాతృకారాధన విజయదశమి రోజులలో జరుపుతూంటారు.



## దేవీ పీఠం : సతి తీర్థ
## దేవీ రూపం : అరుంధతి

అరుంధతీ, సీతా, తార, భగవతి.... మొ॥ పతివ్రతలలో అరుంధతీదేవిదే అగ్రస్థానం. ఈమె సతీమతల్లులకే సతీమతల్లి. కనుకనే సతీతీర్థ సంస్థిత అయినది.

శక్తిపీఠ ప్రదేశం : పతివ్రతలలో

భూలోకమున రానురాను కలి ప్రభావం అధికమయిన తరుణంలో - పతివ్రతల సంఖ్య గణనీయంగా పడిపోతుంది. అది కలి ధర్మం. దాన్నెవరూ దాటజాలరు. కనీసం అరుంధతీ నామస్మరణమే శక్తిగా వార్ని తరింపజేస్తుందట!



## దేవీ పీఠం : **రామతీర్థ**
## దేవీ రూపం : **తిలోత్తమ**

ఇంద్రుని ఆస్థాన నర్తకీమణులైన రంభాది అప్సరసలు, తమ యందు శక్తిరూపమున ఇమిడి ఉన్న సౌందర్యం చేతనే కదా.... అంతటి స్వర్గసీమ నలరించారు. అట్టి సౌందర్యలలన . యందు వివిధ రూపలావణ్యాలతో అంబ సంస్థిత కాగలదట.

శక్తిపీఠ ప్రదేశం : స్త్రీలలోని అందగత్తెల్లో (రమణి)

'యా దేవీ సర్వ సౌందర్యేషు మోహ రూపేణ సంస్థితాః' అని.... తిలోత్తమను బోలు సౌందర్య నారీమణి తన వశీకరణ శక్తితో మహామునులను సైతం ఆకర్షించగలదు అట్టి సమ్మోహరూపిణి అయిన జగన్మాతకు వందనమిదే!



## దేవీ పీఠం : **చిత్త**
## దేవీ రూపం : **బ్రహ్మకళ**

ఈమె చిద్ గగన చంద్రిక

వాగర్థా వివ సంపృక్తౌ: జగతః పితరౌ వందే

వాగర్థ ప్రతిపత్తయే ॥ పార్వతీ ప రమేశ్వరౌః ॥

శక్తిపీఠ ప్రదేశం : సరస్వతి

వాగర్థ స్వరూపులైన ఆదిశక్తీ ఆదిదేవులను చిత్తమున (మనస్సున) దర్శించగలవాడే, మహాబ్రహ్మవేత్త. ఈ శక్తి పీఠ సందర్శన అందరికీ సాధ్యం కాదు! కనుకనే సరస్వతీ కటాక్షం వేదవిదులకే!

## దేవీ పీఠం : జీవ శరీర
## దేవీ రూపం : శక్తి

"యా దేవీ సర్వభూతేషు ।

శక్తి రూపేణ సంస్థితాః ॥

నమస్తస్యై నమస్తస్యై

నమోస్తుతే నమో న్నమః ॥"

(ఏ దేవి అయితే అన్నిటి యందు శక్తి రూపమున గలదో ఆ దేవికి నమస్కారము.)

శక్తిపీఠ ప్రదేశం : దేహధారులలో....



.... అనగా సమస్త జీవుల శరీరములలో 'శక్తి' రూపంలో దేవీరూపం నిక్షిప్తమై ఉందని వేద ప్రామాణ్యం ఉన్నది.

అన్ని ప్రాణులలోను చోదకశక్తి రూపంలో ఉన్న దేవి లేనిదే శివశక్తికి సైతం.... స్పందన ఉండదని ఆదిశంకరులు 'సౌందర్యలహరీ' స్తవంలో స్తుతించారు.

ఇన్ని విశేషాంశాలున్న దేవీ స్వరూపాన్ని సంపూర్ణంగా తెలుసుకోవడం మానవులకు దుర్లభం! దేవతలకు మాత్రమే సాధ్యం! కనుకనే -

'దేవీం వాచ మజన యం త దేవా । తాం.... వదంతి ॥'

**శక్తిపీఠాలుగా ప్రచారంలో ఉన్న మరికొన్ని**

| రాష్ట్రం | ఆలయం |
|---|---|
| 1. ఆంధ్రప్రదేశ్ | కృష్ణాజిల్లాలోని కొల్లేటికోట పెద్దింట్లమ్మవారు |
| 2. ఆంధ్రప్రదేశ్ | కరీంనగర్ జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరి |
| 3. తమిళనాడు | తిరుచ్చిజిల్లా సమయపురం మారియమ్మ |
| 4. తమిళనాడు | ట్రిచ్చి జిల్లా, జంబుకేశ్వరం అఖిలాండేశ్వరి |
| 5. ఒరిస్సా | కుర్దారోడ్, భాలుగా 18 కి.మీ. నారాయణి |
| 6. కర్ణాటక | శిరసి, ధార్వాడజిల్లా చాముండీదేవి |
| 7. మహారాష్ట్ర | పూణేజిల్లా, పూణే చింతపూర్ణి |
| 8. గుజరాత్ | పోర్‌బందర్, జిల్లా కేంద్రం హర్షదేమాత |
| 9. అస్సాం | గౌహతి, జిల్లా, తేజ్‌పూర్ భైరవి |
| 10. హర్యానా | బుధగాంవ్, ఢిల్లీకి 30 కి.మీ. శివశక్తి మాత |

**అనుబంధము**

**కేవలం అమ్మవారి గురించి మాత్రమే కాకుండా స్వామివారి క్షేత్రాలు కొన్ని...**

**గొప్ప శైవ (లింగ) క్షేత్రావళి**

1. వేదారణ్యపురంలో వేదారణ్యలింగం. ఈ క్షేత్రం తమిళనాడులోని మన్నార్‌గుడికి 50 కి.మీ.
2. కోటితీర్థంలో కోటీశ్వరనాధుడు. ఈ క్షేత్రం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి తీరాన వెలసిన కోటిపల్లి.
3. సిరినగరంలో నంజుండేశ్వరుడు. ఈ క్షేత్రం కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌కు 20 కి.మీ. దూరాన గల నంజన్‌గూడ్‌లో ఉన్నది.
4. ప్రయాగలో నీలకంఠేశ్వరుడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ సమీపంలో వున్న త్రివేణీ సంగమంలో ప్రయాగ నీలకంఠేశ్వర లింగం.
5. సోమాద్రిలో మల్లికార్జునేశ్వరుడు. ఈ క్షేత్రం మహారాష్ట్రలోని ఇలార్కేకు 6 కి.మీ. దూరంలో ఉన్న గాట్ ఖండ్ వద్ద ఉన్నది.
6. గండకీలో శివనాధుడు. ఈ క్షేత్రం నేపాల్‌లోని ముక్తినాధ్, గండకీ, దేవిక, చక్రా నదుల సంగమ స్థానం. ధవళగిరి జిల్లాలో పోఖరాకు 75 కి.మీ. జాసమ్‌కు 20 కి.మీ.
7. త్రిమండ కూటంలోని అగస్త్యేశ్వరుడు. ఈ క్షేత్రం ఉత్తరప్రదేశ్‌లోని సత్నాకు 70 కి.మీ. దూరంలో చిత్రకూటం వద్ద గలదు.
8. ధర్మస్థలలో మంజునాధుడు. ఈ క్షేత్రం కర్నాటకలో మంగుళూర్‌కు 75 కి.మీ. దూరంలో దక్షిణ కెనరా జిల్లా బేలతంగడి తాలూకాలో ఉంది.
9. గంధమాదన పర్వతం మీద కూర్మేశ్వరుడు. ఈ క్షేత్రం తమిళనాడులోని రామనాధపురం జిల్లా యందు రామేశ్వరానికి 6 కి.మీ. దూరంలో ఉంది.

10. శ్రీముఖ లింగంలో ముఖలింగేశ్వరుడు. ఈ క్షేత్రం శ్రీకాకుళం జిల్లా (ఆం.ప్ర.)లోని జిల్లా కేంద్రం నుండి 56 కి.మీ. వంశధారానదీ తీరం.
11. స్వర్ణవతీపురంలో కలిగేశ్వరుడు. ఈ క్షేత్రం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు 15 కి.మీ. దూరంలో పనావామ్ తాలూకాలో 'కాలే' గ్రామంలో ఉంది.
12. రుద్రప్రయాగలోని ఏకాదశ రుద్రేశ్వరుడు. ఈ క్షేత్రం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బదరీనాథ్‌కు వెళ్లే మార్గంలో ఉన్నది.

పేరుకు శివక్షేత్రాలు అనే మాటయే! గాని....
చాలాచోట్ల శివకేశవులకు భేదము లేదని చాటిచెప్పే ఆలయాలే అధికం!

సూచన : ఈ స్తుతులలో ఇవ్వబడిన గాయత్రీ స్తోత్రాలు 8. రోజుకు మూడు పర్యాయములకు తక్కువ గాకుండా, 41 రోజులు (మండలం) పఠించినచో సత్ఫలితం తథ్యం! శక్తిపీఠాలలో పేర్కొన్న పేర్లకు సంబంధించి కొన్ని అరుదైన స్తుతులు

ఓం సర్వకళా విద్మహే!
సహస్రదళ ధీమహిః
తం నో దేవిః ప్రచోదయాత్ ॥

ఈ స్తుతులు ఆయా శక్తిపీఠ సందర్శన సందర్భాలలోను నిత్య పూజాదికాలు జరిపే నిమిత్తం కూడా పఠించదగ్గవి. ఇవి శక్తి ముక్తి ఐశ్వర్య ప్రదాయకాలు.

**శ్రీ సరస్వతి గాయత్రి**

ఓం బ్రహ్మీదేవ్యైచ విద్మహే
వాగ్వైవ్యైచ ధీమహిః ।
తం నో సరస్వతిః ప్రచోదయాత్ ॥

**శ్రీలక్ష్మీ గాయత్రి**

ఓం మహాదేవ్యైచ విద్మహే
విష్ణు పత్న్యైచ ధీ మహిః ।
తం నో లక్ష్మిః ప్రచోదయాత్ ॥

**శ్రీదేవి గాయత్రి**

ఓం కాత్యాయనాయ విద్మహే
కన్యకుమారి ధీమహిః ।
తం నో దుర్గిః ప్రచోదయాత్ ॥

**భవాని స్తోత్రం**

అరుణాం కరుణా తరంగితాక్షీం
ధృతి పాశాంకుశ పుష్పబాణ చాపాం ।
అణిమాదిభి రాకృతాం మయూఖైః
అహమిత్యేన విభావయే భవానీం ॥

**ఈశ్వరి స్తోత్రం**

సర్వబాధా ప్రశమనం ।
త్రై లోక్యస్యా దఖిలేశ్వరి ॥
ఏవ మే వ త్వయా కా ।
వా మ స్మద్వైరి వినాశకం ॥

**గిరిజా స్తుతి**

ఓం కైవల్యోపనిషద్ వేద్యం
కైవల్యానంద తుందిలం ॥
కైవల్య గిరిజారామం - స్వ
మాత్రం కలయే న్వహమ్ ॥

**శ్రీ మహాలక్ష్మీ ధ్యానం**

పూర్ణేందు బింబ వదనాం ।
రత్నాభరణ భూషితాం ॥
వరదాభయ హస్తాభ్యాం ।
ధ్యాయేత్ చంద్ర సహోదరీం ॥

**స్వర్ణలక్ష్మీ స్తుతి**

తేజోరూపం కనక వసనాం స్వర్ణ ।
భూషో జ్వలాంగీం బీజాపూరం కనక ॥
కలశం హేమపద్మం దధానాం మన్యాం ।
శక్తిం సకల జననీం విష్ణు వామాంకస్థితాం ॥

**భగవతీ స్తుతి**

ఇచ్ఛారూపాం - భగవతీం ।
సచ్చిదానంద రూపిణీం ॥
సర్వజ్ఞాం సర్వ జననీం ।
విష్ణు వక్ష స్థలా లయాం ॥

**వనదుర్గా గాయత్రి**

ఓం మహా విద్యైచ విద్మహే ।
వనదుర్గై చ ధీమహిః
తంనో మహావిద్యః ప్రచోదయాత్ ॥

**రాజ్ఞీ గాయత్రి**

ఓం చంద్ర బింబాయ విద్మహే ।
సంపత్కరాయ ధీమహిః
తం నో రాజ్ఞీః ప్రచోదయాత్ ॥

### చండీ గాయత్రి

ఓం చండీశ్వరాయ విద్మహే ।
మహా చండాయ ధీ మహిః ।
తం నో చండః ప్రచోదయాత్ ॥

### గౌరి గాయత్రి

ఓం గణాంబికాయ విద్మహే
మహా తపాయ ధీ మహిః ।
తం నో గౌరిః ప్రచోదయాత్ ॥

### మహాకాళీ ధ్యానం

శ్లో ॥ శివా రూఢాం మహాభీమాం
ఘోర దంష్ట్రాం హసన్ముఖం ॥
చతుర్భుజాం - ఖడ్గముండ
వరా భయంకరాం - శివాం ॥
శ్లో ॥ ముండ మాలాం ధరాం దేవీం
లల భక్త వశ్యం దిగంబరాం ॥
ఏవం సం చిత్నయే తా వం
శ్మశానాలయ వాసినీం ॥

### కమలా ధ్యానం

శ్లో ॥ త్రివళీ వలయోపేతం నాభి నాళ
సురేసినీం రత్నద్వీపే మహాద్వీపే ॥
సింహాసన సమన్వితే ప్రపుల్ల
కమలారూఢాం ధ్యాయతాం బాగగేహినీం ॥

### సరస్వతీ స్తుతి

సరస్వతీ మహాభాగే ।
విద్యే కమల లోచనే ॥
విశ్వరూపే విశాలాక్షే ।
విద్యాం దేహీ నమోస్తుతే ॥

### లక్ష్మీ స్తుతి

వందే పద్మకరాం ప్రసన్న వదనాం
సౌ భాగ్యదాం - భాగ్యదాం ॥
హస్తాభ్యాం - అభయప్రదాం
మణిగణైర్నానావిధై ర్భూషితాం ॥

### పార్వతీ స్తుతి

ఓంకార పంజర శుకీం
ఉపని షదుద్యాన కేళీం ॥
కలకంఠీం ఆగమ విపిన
మయూరీం  ఆర్యాం అంతర్విభావయే గౌరీం ॥

### ఓంకార స్తుతి

ఓం కార భువన స్థానం ।
శంకరం దామ తేజసాం ॥
శివం వందే వాసవాబ్జం ।
భూ నారాయణ సేవితాం ॥

### ఆయుర్వృద్ధి స్తుతి

మృత్యుంజయాయ రుద్రాయ ।
నీలకంఠాయ శంభవే ॥
అమృతేశాయ శర్వాయ ।
మహాదేవాయతే నమః ॥

### సర్వదేవ స్తోత్రం

ఆకాశా త్పతియం తోయం ।
యథాగచ్ఛతి సాగరం ॥
సర్వదేవ నమస్కారం
కేశవం ప్రతిగచ్ఛతిః ॥

### ఓం స్వస్తిః

శ్లో ॥ మంగళం - భగవతిర్దేవీ
మంగళం - పరమేశ్వరీ ॥
మంగళం - నళినాయతాక్షీ
మంగళం - సర్వమంగళా ॥

సతతం శ్రీరస్తు ।
సమస్త సన్మంగళాని భవంతు ॥
నిత్య జయ మంగళాని భవంతు ।
సదా సౌభాగ్య ఐశ్వర్య వర్ధతు ॥

మంగళం మహత్ ।
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

# OUR NEW ARRIVALS

ఋషి
ప్రచురణలు
హనుమాన్‌పేట, విజయవాడ-520 003.







